జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

RNI Regn No. 52879/93

2021, జూలై 1-31

రాజ్యాంగ ద్రోహం దేశద్రోహం కాదా?

పెట్టుబడిదారీ విధానం సంపద వారసత్వం

వ్యాక్సిన్ సామ్రాజ్యవాదం

భారత నవ 'గణతంత్ర భయం'

నిఘా నీడ - మోడీ సర్కార్

మతాతీత నైతిక ప్రవర్తన కావాలి..!

కాషాయీకరణ దిశగా చరిత్ర

అస్తిత్వ చరిత్ర - అస్తిత్వ స్పృహ

చారిత్రక వనరులపై నిర్లిప్తత ఎందుకు?

కళకళలాడుతున్న గౌతమీ గ్రంథాలయం

లాల్-నీల్ మైత్రి - నేటి చారిత్రక అవసరం

దోపిడీ, వివక్షలపై పోరాటానికి లాల్ -నీల్ ఐక్యత

మహత్తర విప్లవానికి బాటలు

లాల్, నీల్ మైత్రి ప్రజాస్వామ్య రాజకీయం

మార్క్సిజం సృజనాత్మక మైనది

19-20

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

2021 జూలై 1-31
సంపుటి : 29
సంచిక : 19,20

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

## ఈ సంచికలో...

3 రాజ్యాంగ ద్రోహం దేశద్రోహం కాదా? — కె. మురళి
5 పెట్టుబడిదారీ విధానం సంపద వారసత్వం — ప్రభాత్ పట్నాయక్
7 వ్యాక్సిన్ సామ్రాజ్యవాదం — ప్రబీర్ పురకాయస్థ
9 భారత నవ 'గణతంత్ర భయం' — డాక్టర్ ఎన్.సీ ఆస్థానా
12 నిఘా నీడ – మోడీ సర్కార్ — కె. శాంతారావు
13 మతాతీత నైతిక ప్రవర్తన కావాలి..! — డాక్టర్ దేవరాజు మహారాజు
16 కాషాయీకరణ దిశగా చరిత్ర — జియా ఉస్సలామ్
18 అస్తిత్వ చరిత్ర – అస్తిత్వ స్పృహ — వకుళాభరణం రామకృష్ణ
20 చారిత్రక వనరులపై నిర్లిప్తత ఎందుకు? — సంగిశెట్టి శ్రీనివాస్
22 కళకళలాడుతున్న గౌతమీ గ్రంథాలయం — డా॥ అరిపిరాల నారాయణరావు
23 ఆలోచింపచేసే వ్యాసం - పి.పి.శాస్త్రి
24 లాల్ నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరం
25 దోపిడీ, వివక్షలపై పోరాటానికి లాల్ నీల్ ఐక్యత
26 మహత్తర విప్లవానికి బాటలు — డి. హనుమంతరావు
27 లాల్ నీల్ మైత్రి ప్రజాస్వామ్య రాజకీయం — ఆర్.వెంకట్ రెడ్డి
31 మార్క్సిజం సృజనాత్మక మైనది — రేకా చంద్ర శేఖర రావు

# కేంద్రం కౌగిట్లోకి సహకార రంగం

**సంపాదకీయం**

జూలై 6వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త ప్రభుత్వ శాఖను ప్రకటించింది. కేంద్రంలో సహకార మంత్రిత్వ శాఖ ఏర్పడింది. హోంమంత్రి అమిత్‌షాకు ఈ శాఖను అప్పగించారు. క్షేత్రస్థాయి వరకు అంటే గ్రామాల వరకు "ప్రజల భాగస్వామ్యం" గల సహకార రంగాన్ని విస్తృత పరచడం, బలోపేతం చెయ్యడం దీని లక్ష్యంగా అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు.

97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాల ఏర్పాటు పౌరహక్కులలో భాగం అయింది. ఈ రంగం రాష్ట్రాల అధికార పరిధిలోనిది అని స్పష్టం చేయబడింది.

నాబార్డ్ లెక్కల ప్రకారం దేశంలో 95,238 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలున్నాయి. 363 జిల్లా సహకార బ్యాంకులు వున్నాయి. 33 రాష్ట్ర సహకార బ్యాంకులు ఉన్నాయి. వీటి పరిధిలో వేల కోట్ల రూపాయల డిపాజిట్లు, ఆస్తులు ఉన్నాయి. దాదాపు 3 లక్షల కోట్ల రూపాయలను రైతులకు వ్యవసాయ రుణాలను అందిస్తున్నాయి. ఇవి కాకుండా సహకార రంగంలో పాల డైరీలు, పంచదార మిల్లులు, స్పిన్నింగ్ మిల్లులు వున్నాయి. అవి ఆయా రాష్ట్రాలలోనూ, కొన్ని ప్రాంతాలలోనూ గ్రామాల స్థాయి వరకూ విస్తరించి వున్నాయి.

ఇప్పటికే వ్యవసాయ చట్టాల సవరణ పేరుతో రాష్ట్రాల పరిధిలో వున్న వ్యవసాయ రంగాన్ని కేంద్రం కబ్జా చేసింది. కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చెయ్యడానికి ద్వారాలు తెరిచింది. ఇప్పుడు దాని కన్ను సహకార రంగం మీద పడింది. ఈ చర్యలో బిజెపి రాజకీయ లక్ష్యాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి.

హిందూత్వ రాజకీయ లక్ష్యం "హిందూ రాష్ట్ర" సాధించడం. అందుకోసం దేశంలో వైవిధ్యాన్ని తొలగించి ఒక ముద్దగా చెయ్యాలి. దాని దృష్టిలో రాష్ట్రాలు కేవలం కేంద్రం పరిధిలో దానికి సహకరించే ఉపాంగాలుగా వుండాలి. అందుకే అది రాష్ట్రాల అధికారాలను ఒకదాని వెంట మరొకటి లాగేసుకుంటున్నది. ఒకే దేశం ఒకే పన్ను పేరుతో పన్నుల అధికారాన్ని స్వంతం చేసుకున్నది. ఒకే దేశం ఒకే విద్య పేరుతో విద్యారంగాన్ని శాసించే కొత్త విధానానికి చరిత్రను ఏకరూపం చేసే పనికి, ఒకే మార్కెట్ పేరుతో వ్యవసాయ రంగాన్ని కబళించడానికి పూనుకున్నది. ఇప్పుడు రాష్ట్రాల పరిధిలో వున్న సహకార రంగాన్ని తన కౌగిట్లోకి తెచ్చుకునే పని ప్రారంభించింది.

రెండోది సహకారరంగానికి ఎన్నికలలో క్షేత్రస్థాయి ప్రాధాన్యత వుంది. అందు కోసమే గుజరాత్‌లో అమూల్‌ను హింసించి, వేధించి తన గుప్పెట్లోకి తెచ్చుకుంది. గ్రామీణప్రాంతంలో పాలసేకరణ కేంద్రాలను తనకు బూత్‌స్థాయి నిర్మాణంగా వినియోగించుకుంటున్నది. మహారాష్ట్రలో శరద్‌పవార్ సహకార చక్కెర పరిశ్రమలను రాజకీయంగా వినియోగించుకోవడం అందరికీ తెలిసిందే. గ్రామీణ స్థాయిలో బలహీనంగా వున్న బిజెపి తన దేశవ్యాపిత విస్తరణకు సహకార రంగాన్ని ఎంచుకుంది. అందుకే క్షేత్రస్థాయి వరకు విస్తరించే అధికారాన్ని సహకార సంస్థల ద్వారా పొందాలని చూస్తున్నది. పైగా వేల కోట్ల ఆస్తులున్న సహకార రంగాన్ని తన ఆర్థిక విధానాలకు అనుగుణంగా కార్పొరేట్లకు తోడ్పాటుగా మల్చుకునే కుటిలయత్నంలో భాగమే ఇది.❑

# రాజ్యాంగ ద్రోహం దేశద్రోహం కాదా?

కె. మురళి
నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం



వలసవాద చట్టం రాజద్రోహం ఇంకెన్నాళ్లు అనే ప్రశ్నను సర్వోన్నత న్యాయస్థానం అడిగింది. అది గతించిన కాలానికి చిహ్నం అనే ధ్వని అందులో ఉంది. వలసవాదం ఒకప్పుడు బలమైన, విస్తృతమైన అధికార రూపం. అది జాతీయోద్యమానికి ప్రేరణ ఇచ్చిందనడం ఎంత నిజమో, దాని పునాదులు జాత్యహంకారంలో ఉన్నాయనేది అంతే నిజం. ఇవాళ వలసవాద చట్టం వద్దనే వారందరు, అంతర్గత అసమ్మతిని అణచడానికి దేశద్రోహ చట్టం ఇచ్చే నియంతృత్వ అధికారాన్ని ఇంకో రూపంలో కావాలంటే? పళ్లూడగొట్టుకోడానికి ఏ రాయి అయితేనేం? కాబట్టి వలసవాద చట్టమా లేక జాతీయ చట్టమా అనేది కాదు అసలు సమస్య. సహజ న్యాయ సూత్రాలకు అతీతమైన నియంతృత్వ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి వలస ప్రభుత్వాలకు ఎంత దుర్బుద్ధి ఉందో అంతకంటే ఎక్కువే జాతీయ ప్రభుత్వాలకు ఉందనేది చరిత్ర చెబుతున్న సత్యం. దానికి ప్రధాన కారణం వలస కాలం నాటి కంటే వర్తమానంలో ప్రజల్లో చైతన్యం, అక్షరాస్యత, చర్చించుకునే మాధ్యమాలు పెరగడం. అమాత్యులకు అర్జీలు ఇచ్చుకోవడానికి ఎదురు చూసే రోజులు పోయి ప్రజలు బహిరంగంగా ప్రభుత్వాల అసమర్థతను ఎత్తిచూపే రోజులు వచ్చాయి. ప్రజలు సంఘటితం కావడానికి ఆధునిక సామాజిక మాధ్యమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అంతర్జాల మాధ్యమాల మీద ప్రభుత్వాలు పట్టు బిగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఈ సందర్భంలోనే అర్థం చేసుకోవాలి. న్యాయస్థానాలు కొట్టేసిన చట్టాలను మరల, మరల ఉపయోగించి అసమ్మతి స్వరాలను నొక్కడానికి జరుగుతున్న ప్రయత్నాలు చేస్తున్నవి జాతీయ ప్రభుత్వాలే కానీ వలస ప్రభుత్వం కాదు కదా?

ఎంత విస్తృతమైన అధికారం చెలాయించాలంటే అంత అమూర్తమైన పదబంధంపై ముందు పట్టు సంపాదించాలి. కొద్దిగా ఆలోచిస్తే చాలు, ప్రభుత్వ వ్యతిరేకత, రాజద్రోహం, రాజ్యద్రోహం, దేశద్రోహం, రాజ్యాంగద్రోహం, ప్రజా నైతికతకు ముప్పు అన్న భావనలు భిన్నమైన, కొంత వ్యతిరేకమైన చిత్రాలను మన ముందు ఆవిష్కరిస్తాయి. 'రాచరికాలు లేని రోజుల్లో రాజద్రోహాలు ఏమిటి' అని విశ్వనాథ సత్యనారాయణ ప్రశ్నించారు. అధికారంలో ఉన్న వాళ్లు తమను తాము రాజులు అనుకుంటే తప్ప ఈ పదప్రయోగానికి అర్థమేముంది? సంక్లిష్టమైన రాజ్య వ్యవస్థను కూలదోయాలంటే రాజ్యం లోపలి అనుపానులు తెలిసిన వారికే ఎక్కువ సాధ్యం అని సామాన్యులకు అనిపిస్తే తప్పు ఎవరిది? ప్రభుత్వ వ్యతిరేకత అనేది రాజ్యద్రోహానికి, దేశద్రోహానికి సమానార్థకం అవుతుందా? ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగమే అన్నిటి కంటే ఉన్నతమైన చట్టం అనుకుంటే, దాని సారాంశాన్ని పరిమార్చి, నియంతృత్వఅధికారానికి అనుగుణంగా మార్చుకుంటే, అది రాజ్యాంగ ద్రోహం కాదా? అంతకంటే పెద్ద నేరాలకు పాల్పడే అవకాశం ప్రజలకు ఉంటుందా? రాజ్యాంగానికి అతీతంగా అధికారాన్ని చెలాయించే వాళ్ళు రాజ్యాంగద్రోహులుగా ప్రజలు ఎందుకు అనుకోకూడదు?

భారతీయ శిక్షా స్మృతిలోని రాజద్రోహం సెక్షన్‌ను తీవ్ర జాత్యహంకారి మెకాలే 1836 నాటికే రూపొందించినప్పటికీ అది 1870 వరకు చట్టబద్ధం కాలేదు. ఆ తర్వాత 1898లో దాన్ని సవరించి కఠినతరం చేశారు. సందర్భాన్ని గమనించండి. అప్పటికే భారతీయ పత్రికా రంగం పెరుగుతూ ఉంది. దాని అణిచివేతకు 1878లో వెర్నాక్యులర్ ప్రెస్ చట్టాన్ని తీసుకు వచ్చారు. భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడి వ్యవస్థీకృత రాజకీయ చైతన్యం పెరుగుతూ ఉంది. అన్ని రాష్ట్రాల్లో జాతీయోద్యమ పోకడలు కనిపిస్తున్నాయి. బలమైన భారత విద్యాధిక వర్గం వలస ప్రభుత్వం ప్రాపకంలో ఉన్నప్పటికీ సామాన్యులు గళమెత్తే పోకడలు కనిపిస్తున్నాయి. విదేశీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిధేయతను పెంచడానికి పెద్దగా శ్రమించనవసరం లేదు. ఈ అసమ్మతిని తుంచడానికి దేశద్రోహ చట్టాన్ని తీసుకొచ్చారు. సెక్షన్ 124- ఏ ప్రజల అసమ్మతిని అవిశ్వాసంగా, అవిధేయంగా తద్వారా శత్రుత్వంగా పరిగణిస్తుంది. వాక్ స్వాతంత్రం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రజలను వలస


ప్రభుత్వం సహజంగానే శత్రువుగా పరిగణిస్తుంది. సారాంశంలో రాజద్రోహ నేర భావన వలసాధిపత్యాన్ని, అధికారాన్ని ప్రశ్నించడానికి వీలు లేదనే వైఖరి నుండి పుట్టింది. దీన్ని, ఆధిపత్య పునాదిగా ఏర్పడిన దేశద్రోహ భావనగా సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తారు. ఆ తర్వాత ఈ భావన రూపంలో మారుతూ వచ్చింది.

రాజద్రోహం భావన అథారిటేరియన్ చట్రంలో ఉన్నంత వరకు అది భావ వ్యక్తీకరణకు ప్రమాదకారిగా సమాజాలు భావించాయి. కానీ సమాజంలో హింసను అడ్డుకొనే పేరుమీద రాజద్రోహం భావన సాధికారత సంపాదించుకోవడం మొదలు పెట్టింది. 1942లో భారతీయ ఫెడరల్ కోర్ట్ ఒక కేసులో దేశద్రోహం భావనను కొత్తమలుపు తిప్పింది. 'ప్రభుత్వాల గాయపడ్డ అహాన్ని సంతృప్తిపరచడానికి కాదు రాజద్రోహ చట్టం చేసింది. ప్రభుత్వం పట్ల విధేయత, గౌరవం ప్రజలలో లేకపోతే మిగిలేది అరాచకమే. అంటే చట్టబద్ధ పాలన, పబ్లిక్ ఆర్డర్ అసాధ్యమవుతుంది. అంటే వ్యవస్థ కుప్పకూలకుండా ఉండాలంటే ఈ చట్టం అవసరం' ఆ కోర్టు అభిప్రాయపడింది. హింసకు దారి తీయకుండా వ్యవస్థను నడిపించడమే వలస పాలనా లక్ష్యం అనే ఈ విశ్లేషణ, వలస సందర్భం మారిన తర్వాత కూడా న్యాయ బద్ధత సంపాదించుకుంది. హింస లేకుండా పబ్లిక్ ఆర్డర్ ఉండాలనే లక్ష్యంలో తప్పేముంది అనే ప్రశ్నను సందర్భానికి అతీతంగా అడిగితే, మొదట న్యాయబద్ధంగానే తోస్తుంది. కానీ వలసవాదం పోయి, ప్రజాతంత్ర వ్యవస్థ వచ్చింది అని ప్రకటించుకున్న తర్వాత కూడా ప్రభుత్వాలకు అసమ్మతి లేకుండా, అవిధేయత లేకుండా వ్యవస్థను నడిపించడానికి రాజద్రోహ చట్టం అవసరం అంటే అది న్యాయబద్ధం అవుతుందా? ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్నవారు అసమ్మతి వద్దనరు. కానీ హింసకు దారి తీస్తుంది అనే పేరు మీద అసమ్మతిని అణచడానికి ప్రయత్నం చేస్తారు. ఇది రాజద్రోహం అనే ఆధిపత్య నేరాన్ని దొడ్డిదారిలో కొనసాగించడానికి ఇరుసుగా పనికి వచ్చింది. బహిరంగంగా రాజద్రోహం చుట్టూ జరిగే చర్చలో ఈ లోతట్టు తర్కం స్పష్టంగా కనిపించదు.

హింసకు దారి తీసే వ్యక్తీకరణలు మాత్రమే రాజద్రోహం చట్టం పరిధిలోకి వస్తాయనే విశ్లేషణ ద్వారా వలస చట్టానికి సాధికారాన్ని సంపాదించి పెట్టిన పాపం మాత్రం సుప్రీమ్ న్యాయస్థానానిదే. కేదార్ నాథ్ సింగ్ వెర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ (1962) తీర్పుతో వలస పాలనలో మాత్రమే పనికి వచ్చే ఈ చట్టానికి అంగీకారం తెలిపింది. ఆ తీర్పును తిరగదోడకుండా వలస చట్టం ఇంకెన్నాళ్లు అని ప్రశ్నించి లాభం లేదు. వర్తమానం విషయానికి వస్తే రాజ్యానికి, దేశ సమగ్రతకు, పబ్లిక్ ఆర్డర్‌కు, ప్రజానైతికతకు ముప్పు అనే పద ప్రయోగాలు చాలా అమూర్తమైనవి. వాటితో అధికారంలో ఉన్నవారు ఏ నాట్యమైనా చేయించగలరు. మెజారిటీ కేసులలో 'భారత వ్యతిరేక', 'జాతి వ్యతిరేక', 'సెంటిమెంట్ వ్యతిరేక' వ్యాఖ్యలు చేశారన్న పేరుమీద రాజద్రోహ ఫిర్యాదులు చేసిన వారంతా ప్రైవేటు వ్యక్తులే. రైటిస్టు భావజాలం మాయలో ఉన్నవారు ఆవేశానికి లోనయి ఈ పనికి పూనుకుంటున్నారనుకుంటే అది సమస్యను తక్కువ అంచనా వేయడమే. చాలా పకడ్బందీగా సమన్వయంతో ప్రభుత్వాలను విమర్శించే వారి మీదనే ఈ కేసులు పెడుతున్నారు. రాజద్రోహం కేసుల్లోనే కాదు, కఠినమైన చట్టాలు అన్నింటిలో నేరాలు రుజువు చెయ్యాలనే సంకల్పం ఈనాడే కాదు ఏనాడూ లేదు. వాటి ఉద్దేశమే అది కాదు. న్యాయ ప్రక్రియ క్రమాన్నే ఒక శిక్షగా ఈ చట్టాలు మార్చేశాయి. నేరం రుజువు కానంత వరకు పౌరులందరూ నిర్దోషులే అనే సహజ న్యాయ సూత్రం కాక, నిర్దోషిగా రుజువు కానంత వరకు పౌరులందరూ దోషులే అన్న ప్రతిపాదనే ఈ కఠిన చట్టాలకు పునాది. ఇలాంటి ప్రాతిపదికతో ఉన్న చట్టాలు ప్రస్తుతం దేశంలో 40 వరకు ఉన్నాయి. వాటి పరిధి, విస్తృతి సామాన్య నేరాల వరకు ఆచరణలోనూ, సూత్రరీత్యా పెరుగుతున్నాయి. అయితే ఈ మొత్తం ప్రయోగం ఫలితమేమిటి? ప్రజల్లో భయాన్ని సృష్టించి, బహిరంగంగా జరిగే సామాజిక చర్చ స్వభావాన్ని మార్చడం. ఒకే భావజాలానికి చెందిన చర్చ మాత్రమే సమాజంలో అనుమతించబడుతుంది అనే సందేశాన్ని పంపడం. దానికి భిన్నమైన చర్చనంతా ప్రజలు ఇళ్లల్లో గుసగుస మాట్లాడు కోవాలి. ఈ రాజకీయ ప్రయోగాలను అన్ని భావజాలాలకు చెందిన నియంతృత్వాలు చేశాయి. కొన్ని చట్టాన్ని అడ్డుపెట్టుకుని చేస్తే, కొన్ని తాయిలాలు చూపి, భయపెట్టి చేస్తాయి. అంతే తేడా. వలసవాద చట్టం స్థానంలో జాతీయవాదం పేరుతో ఇంకో నియంతృత్వచట్టం రాకుండా అడ్డుకునే బాధ్యత పౌర సమాజానిదే. లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ❑

*ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...*

# పెట్టుబడిదారీ విధానం సంపద వారసత్వం



ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారుడు తన వారసుడికి సంపదను తన తదనంతరం కట్టబెట్టగలగడం అనేది ఆ వ్యవస్థ మనుగడకు అత్యంత కీలకం అని తరచూ భావిస్తూ వుంటారు. అటువంటి దానికి అవకాశం గనుక లేకపోయినట్లయితే పెట్టుబడిదారుడు ముందుకు పోవడానికి ప్రోత్సహించే అంశం వేరే ఏదీ ఉండదని, అప్పుడు ఆ వ్యవస్థ తన చురుకుదనాన్ని కోల్పోతుందని వారు అనుకుంటారు. ఇంతకన్నా అవాస్తవికమైనది మరొకటి ఉండదు. నిజానికి బూర్జువా వర్గం ఆస్తి హక్కును కలిగి వుండడాన్ని సమర్ధించుకోవడానికి చేసే వాదనలకు వారసత్వం ద్వారా ఆస్తి సంక్రమించడం అనేది విరుద్ధం.



పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన లక్షణాలు ఉంటాయని, వాటిని వినియోగించగలిగితేనే దేశం సంపద్వంతం అవుతుందని, అందువలన ఆ లక్షణాలను వినియోగించుకోవడానికి వీలుగా పెట్టుబడిదారులకు తగిన ప్రతిఫలం ముట్టాలని పెట్టుబడిదారీ ఆస్తి హక్కును సమర్ధించేవారు చెప్తారు. ఆ "అరుదైన లక్షణాలు" ఏమిటో స్పష్టంగా చెప్పే విషయంలో మాత్రం ఈ సమర్ధకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఉత్పత్తి జరిగే క్రమాన్ని పర్యవేక్షించడంలో ఆ ప్రత్యేక లక్షణం ఉంటుందని అనుకుందామా అంటే ఆ పనిని జీతానికి పని చేసే సూపర్‌వైజర్లు చేస్తారు. అందుకుగాను వారికి జీతాలు ముడతాయే తప్ప లాభాలలో వాటా ఏమీ దక్కదు (ఆ కంపెనీలో వారికి షేర్ల రూపంలో కొంత ఆస్తి ఉంటేనే తప్ప). "పరిశ్రమలను నడిపేది పెట్టుబడిదారులు కాదు, ఆ పని వ్యవస్థీకృత సాంకేతికత ద్వారా జరుగుతుంది" అని జాన్ కెన్నెత్ గాల్బ్రియత్ అన్నారు.

పెట్టుబడిదారులకు వుండే "వేటాడే జంతు ప్రవృత్తి" (యానిమల్ స్పిరిట్స్) గురించి కీన్స్ ప్రస్తావించాడు. పోనీ, అదే వారి ప్రత్యేక, అరుదైన లక్షణం అని అనుకుందామా అంటే ఆ లక్షణం ఎంత మొత్తాన్ని పెట్టుబడిగా పెడతాడో దానిని నిర్ణయిస్తుంది తప్ప అసలు ఆ పెట్టుబడిదారుడికి ఆ సంపద ఎలా వచ్చిందో, అది ఆస్తి ఏ విధంగా అయిందో వివరించదు.

పెట్టుబడి పెట్టడం ద్వారా పెట్టుబడిదారుడు రిస్క్ తీసుకుంటాడు గనుక అతనికి ఆ ప్రతిఫలం ముట్టాల్సిందే అని వాదించే వారున్నారు. కాని నిజానికి రిస్క్ తీసుకునేది పెట్టుబడిదారుడు కాదు. బ్యాంకుల ద్వారా పోగుబడిన ఇతరుల సొమ్ము ఆ పెట్టుబడిదారుల దగ్గరకు చేరుతుంది. దానిని అతడు పెట్టుబడి పెడతాడు. ఆ వెంచర్ గనుక దెబ్బ తింటే దాని పర్యవసానం అనుభవించేది ఆ ఇతరులే. అయితే ఈ మధ్య కాలంలో ప్రభుత్వాలు ఆ బ్యాంకులను ఆదుకోడానికి నిధులు వెచ్చిస్తున్నాయి. అలా వెచ్చించడం అంటే ఆ రిస్క్ ప్రభుత్వం తీసుకుంటోందని భావించాలి. అంటే సమాజమే ఆ రిస్క్ తీసుకుంటున్నట్టు అవుతుంది తప్ప పెట్టుబడిదారుడు కాదు. అంటే రిస్క్ తీసుకునే గుణం పెట్టుబడిదారుడికి లేదు.

పెట్టుబడిదారుడు తన ఆదాయాన్ని ఊరికే ఖర్చు చేసేయకుండా పొదుపు చేసి కూడబెట్టి దానిని పెట్టుబడిగా పెడతాడు. ఆ విధంగా ఖర్చు చేయకుండా త్యాగం చేశాడు గనుక అతగాడికి ప్రతిఫలం ముట్టాల్సిందే అని కొందరు వాదిస్తారు. త్యాగం అంటే ఏమిటి? అన్న తాత్విక చర్చలోకి పోనవసరం లేకుండానే ఆ వాదనను తిప్పికొట్టవచ్చు. పెట్టుబడి నుండి పొదుపు వస్తుంది తప్ప పొదుపు నుండి పెట్టుబడి రాదు. పరిశ్రమల్లో అంత వరకూ పూర్తి సామర్ధ్యాన్ని వినియోగించుకోకుండా ఉన్న సందర్భాల్లో ఆ సామర్ధ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించు కోవడానికి అదనంగా పెట్టుబడి పెడతారు. ఆ పెట్టుబడి చలామణీ

అయ్యే క్రమంలో పొదుపుకు కావలసిన ధనం సమకూరుతుంది. ధరలు పెరిగి కార్మికుల నిజ వేతనాలు పడిపోయినపుడు అలా చౌకగా కార్మికుల శ్రమను పొందగలిగినందువలన పెట్టుబడిదారుల వద్ద పొదుపుకు ధనం సమకూరుతుంది. అనేక మంది అనేక కారణాల రీత్యా పొదుపు చేస్తారు. అలా చేయడమే "త్యాగం" అయినట్టు పరిగణించడం, అందుకు వారికి ప్రతిఫలం ముట్టాలని అనడం పెట్టుబడిదారీ వ్యవస్థ నడిచే విధానానికి సరిపడని వాదన.

పెట్టుబడిదారులు ధైర్యశాలురని, అందుచేత కొత్త కొత్త ప్రక్రియలను ప్రవేశపెట్టగలరని, అటువంటి "ధైర్యం" కొద్దిమందికే ఉంటుందని, అందుకే వారికి తగిన ప్రతిఫలాన్ని ముట్టజెప్పాలని మరొక వాదన ఉంది. అయితే, ఎటువంటి కొత్త ప్రక్రియనూ ప్రవేశ పెట్టకుండా సాధారణ పునరుత్పత్తినే కొనసాగించినా కూడా పెట్టుబడిదారుడి వద్ద ఉండే ఆస్తి లాభాలను తెచ్చిపెడుతూనే వుంటుంది. అందుచేత ఈ వాదన కూడా చెల్లదు.

అయితే, పెట్టుబడిదారుడికి ఆస్తి ఎలా సమకూరిందన్నది కాని, లాభం ఎందుకివ్వాలన్నది కాని ప్రస్తుత చర్చనీయాంశం కాదు. పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన లక్షణాలు ఉంటాయని, అందువలన వారి వద్ద ఆస్తి పోగుపడడం గాని, వారికి లాభం చేకూరడం గాని సమర్ధనీయమేనన్న వాదనలు సరైనవే అని మాటవరసకు అనుకుందాం. అటువంటి ప్రత్యేక లక్షణాలు ఏవీ లేకున్నా వారి వారసులకు ఈ ఆస్తి వారసత్వంగా సమకూరడాన్ని ఏ విధంగా సమర్ధిస్తారు? అట్లా సమర్ధించడం ద్వారా పెట్టుబడిదారుడికి ప్రత్యేక లక్షణాలు వుంటాయన్న వాదనను పరోక్షంగా తిరస్కరించినట్టు అవుతుంది కదా? కనుక వారసత్వం ద్వారా ఆస్తి సమకూరడం అనేది పెట్టుబడిదారుడు ఆస్తి కలిగి వుండడాన్ని సమర్ధించే వాదనలను పూర్వపక్షం చేస్తుంది.

ఒక వాదన ఇంకా ఉండిపోయింది. పెట్టుబడిదారుడికి గనుక ఆస్తిని తన వారసులకు బదలాయించే హక్కు లేకపోతే అతగాడు తన ప్రత్యేక లక్షణాలను ప్రదర్శించడానికి ప్రోత్సాహకం అంటూ (ఇన్సెంటివ్) ఏదీ ఉండదు కదా అన్నదే ఆ వాదన. అయితే ఈ వాదన నిజానికి వారసత్వాన్ని సమర్ధించేదిగా కాక, పెట్టుబడిదారుడి బ్లాక్‌మెయిల్‌ను సమర్ధించేదిగా ఉంది. "వారసత్వ హక్కును గనుక అంగీకరించకపోతే నా ప్రత్యేక లక్షణాలను బైటపెట్టను" అని పెట్టుబడిదారుడు సమాజాన్ని బెదిరించినట్టు ఉంది ఈ వాదన. నైతికంగా ఈ వాదన సమర్ధనీయం కాదు. పైగా ఇది తర్కానికి నిలిచేది కాదు. వారసత్వ హక్కు లేనట్లయితే సమాజంలో సృజనాత్మకత లేకుండా పోతుందా? చొరవ లేకుండా పోతుందా? నూతన ఆవిష్కరణలు లేకుండా పోతాయా? నాకు వారసత్వ హక్కు లేకుండా పోయిందని ఒకడు తన చొరవను, సృజనను ప్రదర్శించడం మానుకుంటే, అతనికి బదులు ఆ లక్షణాలను ప్రదర్శించే మరో వ్యక్తి ముందుకు వస్తాడు– అతగాడికి ఎటువంటి వారసత్వమూ సంక్రమించకపోయినా సరే (మార్కెట్‌లో పోటీ ఉంటుంది కదా). అందుచేత బూర్జువా తర్కం ప్రకారం చూసినా, వారసత్వ హక్కుకు ఎటువంటి తార్కిక సమర్ధనా లేదు.

అందుచేతనే, పెట్టుబడిదారులకు పూర్తిగా అనుగుణంగా ఉండే ప్రస్తుత నయా ఉదారవాద శకంలో కూడా అనేక పెట్టుబడిదారీ దేశాల్లో వారసత్వ పన్ను చాలా ఎక్కువ శాతంలో విధిస్తున్నారు. జపాన్‌లో వారసత్వ పన్ను 50 శాతం. అమెరికాలో కూడా 40 శాతం ఉంది. చాలా యూరోపియన్ దేశాలలో 40 శాతం వరకూ ఉంది. ఈ పన్నును ఎగ్గొట్టేవాళ్ళు ఎక్కువగానే ఉన్నప్పటికీ, వారసత్వ పన్ను ఉండాలనే సూత్రాన్ని మాత్రం విస్తృతంగానే ఆమోదిస్తున్నారు.

మన దేశంలో మాత్రం ఒక వైపు ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నా, సంపద పన్ను గాని, వారసత్వ పన్ను గాని ఉన్నట్టు గట్టిగా చెప్పుకోడానికి లేదు. ఈ విషయమై పబ్లిక్‌లో ఎటువంటి చర్చ కూడా జరగడంలేదు. రాజ్యాంగం మనకు సమాన అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చినా, చాలా మంది దృష్టిలో సమాన అవకాశాలు అనేవి ఆచరణలో సాధ్యంకాని ఒక కలగానే ఉంది. అందుచేత ఆ విషయాన్ని విడిచిపెట్టి తమ దుర్భర పరిస్థితుల నుండి ఎంతోకొంత ఊరట కలిగించే సహాయ చర్యలనే వారు కోరుకుంటున్నారు. కాని ప్రజాస్వామ్యం మనగలగాలి అంటే సమాన అవకాశాలు ఉండి తీరాలి (ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా సాధ్యం కాదు). సమాన అవకాశాలు కల్పించే వైపుగా అడుగు పడాలంటే సంపదలో ఉన్న అసమానతలను తగ్గించడం, వారసత్వం ద్వారా సంపద సంక్రమించే సూత్రాన్ని రద్దు చేయడం మొదటి మెట్టు అవుతుంది.

దీనివలన ఒనగూడేదేమిటో కొన్ని అంకెల ద్వారా వివరించ వచ్చు. 2019లో మన దేశంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న సంపద విలువ సుమారు రూ.945 లక్షల కోట్లు అని అంచనా వేశారు. ఇందులో అత్యంత సంపన్నులు ఒక శాతం మంది వద్ద 42.5 శాతం సంపద ఉంది. అంటే అది సుమారు రూ. 400 కోట్లు. దీని మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధించినా

☞ మిగతా 11వ పేజీలో

# వ్యాక్సిన్ సామ్రాజ్యవాదం



**ప్రబీర్ పురకాయస్థ**

మోడీ ప్రభుత్వం తొలుత ప్రకటించిన వ్యాక్సిన్ విధానంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో జూన్ 7న ఆ విధానాన్ని కొంతమేరకు మారుస్తూ మోడీ మరో విధాన ప్రకటన చేశారు. అయితే ఆ సందర్భంలోనే ప్రధాని మన దేశ వ్యాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యం, చరిత్రపై చేసిన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయి. ఇన్నాళ్ళూ తన ప్రజలకు సరిపడా వ్యాక్సినేషన్ చేయగల సామర్థ్యం మన దేశానికి లేదని, తన ప్రభుత్వ హయాంలో మాత్రమే మొదటిసారి రెండు వ్యాక్సిన్‌లను స్వంతంగా తయారు చేయగలిగామని మోడీ ప్రకటించారు. వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తిదారుగా ఉన్న మన దేశం మోడీ హయాంలో మన దేశ ప్రజల వరకైనా సరిపడా వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయలేని దుస్థితిలో పడిపోయింది. ఈ చేదు వాస్తవం నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి మోడీ తాపత్రయపడుతున్నారు.

మన స్వంత టెక్నాలజీతో వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయగల దేశంగా భారతదేశం ఎప్పటినుండో ముందుంది. ముంబైలోని హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, కసౌలీలోని సెంట్రల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, కూనూర్‌లోని పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్, చెన్నైలోని బిసిజి వ్యాక్సిన్ లాబొరేటరీ వంటి సంస్థలు ఇందులో కీలక పాత్ర పోషించాయి. మశూచి, పోలియో వంటి వ్యాధులను నిరోధించే వ్యాక్సిన్‌లను విజయవంతంగా ఉత్పత్తి చేయగలిగింది మన దేశం. 1970 పేటెంట్ చట్టాన్ని ఉపయోగించుకుని ప్రపంచంలోకెల్లా అతి పెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తిదారుగా, జెనెరిక్ మందుల ఉత్పత్తిదారుగా భారతదేశం నిలిచింది. ఈ పరిస్థితి 2014లో మోడీ ప్రధాని అయ్యేవరకూ కొనసాగింది.

ఇప్పుడు మోడీ 'ఆత్మనిర్భర భారత్' అనే నినాదాన్ని కొత్తగా ముందుకు తెచ్చారు. అంతకుముందు 'దేశ స్వావలంబన' అన్న నినాదం ఉండేది. రెండిటికీ మధ్య తేడా ఏమిటి? స్వావలంబన అంటే మనం స్వంతంగా టెక్నాలజీని పెంపొందించుకుని మనకు అవసరమైన ఉత్పత్తినంతటినీ మనమే చేయగలగడం. కానీ, ఆత్మనిర్భరత అంటే అది కాదు. టెక్నాలజీ ఎవరిదైనా సరే, ఉత్పత్తి మాత్రం భారతదేశంలో జరిగితే చాలు. అందుకే కోవిషీల్డ్ తయారీకి సీరం ఇన్‌స్టిట్యూట్ ఉపయోగిస్తున్న టెక్నాలజీ బ్రిటన్ దేశపు ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా సంస్థదైనప్పటికీ, ఉత్పత్తి ఇండియాలో జరుగుతోంది గనుక అదంతా కూడా మన ఘనత కిందే చెప్పుకోవడం జరుగుతోంది. రాఫెల్ యుద్ధ విమానాలను ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసినా, వాటిని సమకూర్చుకోవడం మన ఘనత అని, అదే ఆత్మనిర్భరత అని మోడీ చెప్పుకుంటున్నారు.

ఇప్పుడు వ్యాక్సిన్ల మీద పేటెంటు హక్కులున్న బడా ఫార్మా కంపెనీలు వ్యాక్సిన్ ఉత్పత్తి లైసెన్సులను ఏయే సంస్థలకు ఇవ్వాలి, ఎంత కాలం పాటు ఇవ్వాలి, ఏ రేటుకు ఇవ్వాలి వగైరా అంశాలను నిర్ణయిస్తున్నాయి. ప్రపంచ ప్రజలకు ఎంత త్వరగా వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేసి అందించాలి అన్నది వాటికి ముఖ్యం కాదు. వాటికి లాభం ఎంత ఎక్కువ వస్తుంది అన్నదే ముఖ్యం. అందుకే ప్రపంచవ్యాప్తంగా పేటెంటు హక్కులను వ్యాక్సిన్‌ల విషయంలో సడలించాలన్న డిమాండ్ బలంగా ముందుకి వచ్చింది.

ప్రపంచ జనాభా మొత్తానికి వ్యాక్సిన్ వేయించడానికి 5000 కోట్ల డాలర్లు అవసరమవుతాయని, ఆ మొత్తాన్ని గనుక సంపన్న దేశాలు ఖర్చు చేయగలిగితే 2022 చివరికల్లా ప్రపంచానికి కోవిడ్-19 నుంచి విముక్తి కలిగించవచ్చునని డబ్ల్యుహెచ్‌వో చెప్తోంది. ఒకవేళ ఈ కోవిడ్ గనుక 2025 దాకా కొనసాగితే ప్రపంచ సంపద 9 లక్షల కోట్ల డాలర్ల మేరకు ఆవిరవుతుందని మరోపక్క ఐఎంఎఫ్ అంచనా వేసింది. 5000 కోట్ల డాలర్ల ఖర్చుకు వెనకాడితే అంతకు 200 రెట్లు నష్టపోతామన్నమాట. అందుచేత త్వరగా ఈ మహమ్మారిని అంతమొందించడం వెనుక సంపన్న దేశాల ప్రయోజనాలు సైతం ఉన్నాయని గుర్తించాలి.

ఇప్పటిదాకా ఆఫ్రికాలో వ్యాక్సిన్ పొందినవారు ఒక శాతం కన్నా తక్కువే ఉన్నారు. ఆసియాలో 2.5 శాతం దాటలేదు. అదే అమెరికా, బ్రిటన్ దేశాలలో 42 శాతానికి అందింది. ఈ లెక్కన సంపన్న దేశాలలో రాబోయే 3-6 నెలల్లో అందరికీ వ్యాక్సిన్ అందుతుంది. కాని తక్కిన ప్రపంచానికి అందడానికి మరో మూడేండ్లు పడుతుంది. ఇప్పుడు జి-7 దేశాలు ఇస్తామన్న 100 కోట్ల డోసులూ మొత్తం అవసరంలో ఎనిమిదో వంతు మాత్రమే. అంటే, తక్షణమే వ్యాక్సిన్ ఉత్పత్తిని పెంచకపోతే ఈ కరోనా

మహమ్మారి దీర్ఘకాలం మనల్ని పీడించడం ఖాయం. మరి అమెరికా, తదితర సంపన్న దేశాలు ఈ ముప్పును ఎందుకు ఉపేక్షిస్తున్నాయి?

ప్రపంచానికంతటికీ అవసరమైన వ్యాక్సిన్‌లను ప్రపంచంలో అన్ని చోట్లా ఉత్పత్తి చేయడానికి ఉన్న ఆటంకాలేమిటి? 130 కోట్ల జనాభా ఉన్న ఆఫ్రికా ఖండం వ్యాక్సిన్ అవసరాల్లో 99 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుంది. ఆ ఖండంలోనే ఉత్పత్తి ఎందుకు జరగదు? ప్రస్తుతం వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రధానంగా అమెరికా, ఇండియా వంటి దేశాలలో కేంద్రీకృతమై ఉంది. అందుచేత ఆ దేశాల అవసరాలకే ముందు ప్రాధాన్యతనిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్‌ను అందించడానికి ఇది ఆటంకంగా ఉంటుంది. మే 2020లో జరిగిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీ వ్యాక్సిన్ తయారీ టెక్నాలజీని, మందుల ఉత్పత్తి, పరీక్ష కిట్ల ఉత్పత్తి టెక్నాలజీలను ప్రపంచ దేశాలన్నింటితోనూ పంచుకోవాలని తీర్మానించింది. అంటే వీటికి సంబంధించిన పేటెంటు హక్కులను పక్కన పెట్టాల్సి ఉంటుంది. అందుకు అమెరికా ససేమిరా అంది.

ఇప్పుడు బడా ఫార్మా కంపెనీలకి కరోనా మందులు, వ్యాక్సిన్‌లు ఒక కొత్త మార్కెట్‌గా ఉన్నాయి. అందుకే ఆ కంపెనీలు పేటెంటు సడలింపును గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. వీటికి సంపన్న దేశాలు వత్తాసు పలుకుతున్నాయి. మొన్నటిదాకా మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్‌సిస్టమ్ మీద పేటెంటు హక్కులతో విపరీతంగా లాభాలు గడించిన బిల్‌గేట్స్ ఇప్పుడు ఫార్మా రంగంలో కొత్త చక్రవర్తిగా అవతరించాడు. బడా ఫార్మా కంపెనీల వద్ద పేటెంటు హక్కులను ఉంచుకుంటూనే లోకల్‌గా ఉత్పత్తికి లైసెన్సు లివ్వాలన్న వాదనను ముందుకు తెచ్చాడు. అంటే వ్యాక్సిన్ ఉత్పత్తి ఎక్కడైనా చేసుకోవచ్చు. కాని ఎంతకాలంపాటు చేయాలి, ఏ రేటు పేటెంటు హక్కుదారులకు చెల్లించాలి అన్నది బడా ఫార్మా కంపెనీలే నిర్ణయిస్తాయి. దేశ స్వావలంబనకు, ఆత్మనిర్భరతకు ముందు చెప్పుకున్నట్టు ఎంత తేడా ఉందో, పేటెంటు చట్టాల సడలింపునకు, బడా ఫార్మా కంపెనీల ప్రతిపాదనకు అంత తేడా ఉంది.

ఆయా దేశాలు స్వంతంగా వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం పెంచుకోడానికి వీలు లేకుండా చేయడమే బడా ఫార్మా కంపెనీల వ్యూహం. గతంలో ఆఫ్రికా దేశాలు ఇండియా నుండి జెనెరిక్ ఎయిడ్స్ మందులను మార్కెట్ ధరలో పదో వంతుకే కొనుగోలు చేశాయి. మన దేశంలో అప్పుడున్న పేటెంటు చట్టాల వలన చవకగా ఉత్పత్తి చేయగలిగాం. అప్పుడు ఆ కొనుగోలును నిరోధించడానికి ప్రయత్నించి బడా ఫార్మా కంపెనీలు భంగ పడ్డాయి. అందుకే మరో మారు అలా జరగకుండా జాగ్రత్త పడుతున్నాయి. పేద దేశాలు ఎక్కువ రేటుకు వ్యాక్సిన్ కొనుగోలు చేయలేవు గనుక సంపన్న దేశాల నుండి సహాయం అందించి ఆ కొరవను భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. తమ లాభాలకు మాత్రం ఏ లోటూ రాకుండా, పేటెంటు చట్టాల సడలింపు జరగకుండా గట్టిగా పట్టుబడుతున్నాయి. అదే సమయంలో మూడవ ప్రపంచ దేశాలలో తమకు పోటీగా కంపెనీలు తయారవకుండా చూసుకుంటున్నాయి.

పేద, మధ్యతరహా దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేయడానికి భారత దేశాన్ని సరఫరా కేంద్రంగా వాడుకోవాలన్నది అమెరికా వ్యూహం. అందుకే బిల్‌గేట్స్ సీరం ఇన్‌స్టిట్యూట్ మీద దృష్టి పెట్టాడు. ఈ సీరం ఇన్‌స్టిట్యూట్ ప్రపంచంలోనే అత్యధిక మొత్తంలో వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న సంస్థ. దీని ద్వారా చౌకగా లభించే వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయించి సరఫరా చేయాలని చూస్తున్నారు. ఎక్కువ ధర లభించే ఎం.ఆర్.ఎన్.ఎ తరహా వ్యాక్సిన్‌ల ఉత్పత్తి మాత్రం తమ వద్దే అట్టిపెట్టుకుంటున్నారు. ఈ చౌక రకాల వ్యాక్సిన్‌లను వెంటవెంటనే ఉత్పత్తి చేయడం కాకుండా నిదానంగా చేసి ప్రపంచంలో వ్యాక్సిన్‌ల కొరత ఉండేలా చూసుకుంటున్నారు. అయితే ఈ పథకం పారదం లేదు. రెండో విడత కరోనా విజృంభించిన తర్వాత ఇండియా ఇతర దేశాలకు సరఫరా చేసేందుకు అంగీకరించిన వ్యాక్సిన్‌లను అందించడంలో విఫలమైంది.

వ్యాక్సిన్ అందించడం ఆలస్యం అవుతున్నకొద్దీ వైరస్‌లో వచ్చే పరివర్తనల వలన ఆ వ్యాక్సిన్‌ల ప్రభావం తగ్గిపోతూ ఉంటుంది. కరోనా మళ్ళీ, మళ్ళీ విజృంభిస్తూనే ఉంటుంది. ఆ విధంగా బడా ఫార్మా కంపెనీలకు నిరంతరం లాభాలు వచ్చి పడుతూనే ఉంటాయి. మనకు మాత్రం పదేపదే విధించే లాక్‌డౌన్లు, ఆర్థిక కార్యకలాపాలకు ఏర్పడే ఆటంకాలు, సామాజిక దూరం పాటించాల్సిన ఆవశ్యకత వంటివి ప్రాణ సంకటంగా తయారవుతాయి. కాని బడా ఫార్మా కంపెనీలకు మాత్రం లాభాల వర్షం కురుస్తూనే ఉంటుంది. ఇలా రాబోయే రెండు, మూడేండ్లలో మూడవ ప్రపంచ దేశాలలో ఆర్థిక కార్యకలాపాలు దెబ్బ తిని, సంపన్న దేశాలు సాపేక్షంగా మెరుగైన స్థితిలో కొనసాగితే అప్పుడు ప్రపంచ వ్యాప్త అసమానతలు మరింత పెరుగుతాయి. ఇప్పటికే కరోనా వలన ప్రపంచంలో పేదలు బాగా దెబ్బతిన్నారు. మరోపక్కన సంపన్నుల సంపద 4 లక్షల కోట్ల డాలర్ల మేరకు అదనంగా పెరిగింది. అంటే కరోనా మహమ్మారి కాలం నయా ఉదారవాద దోపిడీ మరింత వేగంగా కొనసాగడానికి ఇంకొక రూపంలో తోడ్పడిందన్న మాట. ❑

# భారత నవ 'గణతంత్ర భయం'



డాక్టర్ ఎన్.సీ ఆస్థానా
రిటైర్డ్ ఐపీఎస్, కేరళ మాజీ డీజీపీ

అనువాదం : రాఘవ శర్మ

నియంతృత్వంలో నిరసన తెలిపే వారిని 'ప్రజాశతృవులు' అని ప్రకటిస్తారు. వారిని జాతి విద్రోహులని, దేశ ద్రోహులని, దేశ్ కి గద్దార్ అని, ముక్కచెక్కలైన ముఠాలని, జిహాదీలు అని, అర్బన్ నక్సలైట్లు అని, ఐఎస్ఐ ఏజెంట్లని, పాకిస్థాన్ తరపున మాట్లాడేవారని రకరకాలుగా పిలుస్తారు.

మతం కావచ్చు, సంస్కృతి కావచ్చు, మత సామరస్యత కావచ్చు, ప్రజలలో శాంతి, ప్రశాంతత కావచ్చు, ప్రతిదీ ప్రమాదంలో పడిపోయిందని భారత ప్రభుత్వం ప్రకటించినట్టు అనిపిస్తోంది.

ఒక వేళ ఇవి ప్రమాదంలో పడకపోతే, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి, అంతర్గత భద్రత ప్రమాదంలో పడిపోతాయి!

'ఐక్యతను, సమగ్రతను' కాపాడాలని అంతర్గతంగా ఏర్పడిన ప్రమాదానికి వ్యతిరేకంగా రాజకీయనాయకులు ప్రతిరోజూ ప్రజలను ఊదరగొడుతూనే ఉంటారు.

అంతర్గతంగా వచ్చే ప్రమాదం ఏమిటి? అది ఏం చేస్తుందనేది ఎవరికీ తెలియదు.

స్వాతంత్ర్యం వచ్చిన డెబ్బైనాలుగేళ్ళ తరువాత కూడా మన దేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రత్యేకంగా వచ్చిన ప్రమాదం ఏమిటి?

ప్రతి రోజూ మనం ఆ ప్రమాదాన్ని ఎలా భరిస్తున్నామో ఎవరికీ తెలియదు.

దేశ భద్రతకు ముప్పు వాటిల్లేలా చేసే వాట్సప్ మెసేజ్‌లు, ఈ మెయిల్స్, ఫేస్‌బుక్ పోస్టులు, కథనాలు, పుస్తకాలు, పాటలు, నాటకాలు, సినిమాలు వంటివి 280 ఉన్నాయట.

ఆవు పేడ, ఆవు మూత్రం వల్ల కరోనా తగ్గుతుందని యోగా గురువు చెప్పడాన్ని విమర్శిస్తే, పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌ను అభినందిస్తే, వ్యంగ్య చిత్రాలు వేస్తే, సినిమా హాళ్ళలో జాతీయ గీతం వినిపిస్తున్నప్పుడు లేచి నిలబడకపోతే కేసులు పెడుతున్నారు.

ప్రజల మధ్య అసంతృప్తిని రెచ్చగొడుతున్నారనో, మత విశ్వాసాలను నొప్పిస్తున్నారనో ఎవరో ఒకరిపైన దేశ ద్రోహ నేరమో, ఉపా చట్టం కిందో కేసులు పెడతారు.

గజియాబాద్‌లో ఒక వృద్ధుడైన ముస్లిం పైన దాడి చేశారనే సంఘటనను వివరించినందుకు, సాక్ష్యంగా నిలబడినందుకు వారిపై కేసులు నమోదు చేశారు.

## అధిక సంఖ్యాకవాదం, నూతన ప్రజాస్వామ్యం

నిర్ధారణ కాకపోయినప్పటికీ అధికసంఖ్యాకవాదుల వాదనలు, దేశాన్ని అస్థిరపరచేలా ఉన్నాయి. క్రమంగా భారత సమాజం ద్వంద్వ తర్కంలోకి వెళ్ళిపోతోంది.

మీరు అధికసంఖ్యాకవాదం వైపైనా నిలబడాలి, లేదా హింసను అనుభవించడానికైనా సిద్ధపడాలి. ప్రభుత్వం చాలా అరుదుగా మాత్రమే అధిక సంఖ్యాక వాదకులను ప్రశ్నిస్తోంది. చాలా అరుదుగా మాత్రమే వారు చేసే హింసకు శిక్షలు పడుతున్నాయి.

పత్రికల వార్తల ప్రకారం హర్యానాలో బీజేపీ అధికార ప్రతినిధి సూరజ్ పాల్ అము, గత ఏడాది జామియా మిల్లియా విశ్వవిద్యాలయంలో కాల్పులు జరిపిన కేసులో నిందితుడు, మరి కొందరు కలిసి ఇటీవల జరిగిన మహాపంచాయత్‌లో ముస్లిం మహిళను కిడ్నాప్ చేయాలని, సామూహికంగా ముస్లింలను చంపేయాలని పిలుపు నిస్తూ, రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. ఇది గుర్తించదగిన నేరం అయినప్పటికీ, ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు పట్టించుకోలేదు.

అసమ్మతి వాదులు చేసిన అతి చిన్న హెచ్చరికను ప్రభుత్వం తరపున పనిచేస్తోందన్న ఆరోపణలున్న ఒక దుష్ట సైన్యం పట్టుకుంది. ఒక వ్యక్తి అనంతమైన విజ్ఞానం గురించి, దాని అత్మగౌరవప్రదమైన స్థితి గురించి, ధర్మోల్లంఘన గురించి అధికారులను కొందరు అసమ్మతి వాదులు ప్రశ్నించారు.

దీనిపైన కేసు నమోదు చేయాలని కోరుతూ ప్రధాన మంత్రి కార్యాలయానికి, హోం మంత్రి కార్యాలయానికి ప్రతిరోజు ఫిర్యాదులు పంపుతున్నారు. దీంతో భారత ప్రభుత్వం దృష్టికి అసమ్మతి వాదుల కోర్కె తప్ప ఏదొచ్చినా ఆదుర్దాపడిపోతోంది.

## రాజ్యం అభద్రత

అర్థం లేని ఈ వాతావరణాన్ని చూస్తే మనకు సిగ్గేయడం లేదా? ఆ విశ్వగురువు తప్పటడుగు మాటలకు నూటముప్పై అయిదు కోట్ల మంది జనాభా ఉన్న ఈ జాతి రక్తం మరిగిపోవడం లేదా?

దేశమంతా ఇలాంటి మనుషులే ఉన్నట్టయితే, నమ్మక ద్రోహంతో వారి బోధనలు మన నెత్తినెక్కి ఊరేగుతుంటే, మనం ఒక జాతిగా కొనసాగడానికి అర్హులము కాదు.

దేశం చాలా అభద్రతలో ఉందని, 'జాతి, మతం, సంస్కృతి, ప్రమాదంలో ఉన్నాయని కల్పించడం ద్వారా అసమ్మతిని అణచివేయాలనే భావనను పైకి అంగీకరించే నైతిక ధైర్యం భారత ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపించడం లేదు.

ఏ రకమైన నిరసనకైనా వ్యతిరేకంగా భారత రాజ్యం గొంతు విప్పడం మన ప్రజాస్వామ్యానికి చేసిన అతి పెద్ద జబ్బు.

### మార్గం తప్పడమంటే

తెలివిగా ఎన్నికైన నాయకుడు ప్రజాస్వామిక సంస్థలను చక్కగా నాశనం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాడు.

'డెమాక్రస్ డైస్' అన్న పుస్తకంలో స్టెవెన్ లేటెస్టికి, డానియల్ జింబ్లాట్లు చెప్పినట్టు, ఇది నాటకీయత కంటే విధ్వంసానికి సమానం.

సమష్టిగా అందరి చైతన్యాన్ని నిలిపేసి దాని అడుగులు కనిపించనీయకుండా, అది ప్రజాస్వామ్యాన్ని నిదానంగా తినేస్తుంది.

చాలా తెలివిగా ఏళ్ళతరబడి పత్రికారంగాన్ని భయపెట్టే ఎత్తుగడను అనుసరిస్తూ వచ్చింది.

రాజకీయంగా, సైద్ధాంతికంగా వ్యతిరేకులను, మైనారిటీలను ఎంపిక చేసుకుని వారిపైన కేసులు పెట్టింది.

వలస వచ్చిన వారిని 'పరాయి వాళ్ళు' అని అధికసంఖ్యాకుల చేత చూపించి, విధ్వంస పూరిత చారిత్రక వర్ణనలతో దోచుకోవడానికి జాతీయ భద్రత విభాగాలను ఉపయోగించుకుని చట్టాలను దుర్వినియోగం చేసింది.

చారిత్రక తప్పిదాలను సరైనవిగా చూపిస్తూ, 'సమష్టి చేతన' పేరుతో అరాచకాలను సృష్టించడానికి తమకు తాము లైసెన్స్ పొంది, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా తాము అవతరించామని ప్రకటించుకుంటున్నారు.

చాలా కాలంగా ప్రజలు దాని అసంబద్ధతను గమనించక పోవడం పెద్ద విషాదం.

ఒక ముఖ్యమంత్రి చట్టాన్ని చేతిలోకి తీసుకుని నేరస్తులను ఎన్‌కౌంటర్‌లో చంపేయమని (థోక్ దియా జాయెగా) అని పిలుపివ్వడం బహిరంగ అవమానం.

ప్రభుత్వం గురించి వ్యతిరేకంగా రాస్తే, జర్నలిస్టుల పైన, పత్రికలపైన అర్థంపర్థం లేని కేసులు పెట్టడం, 'నీపైన కేసు పెట్టేస్తాం' (కేస్ కర్ దియా జాయెగా) అని హెచ్చరించడం వారి ఆయుధాల్లో ఒకటి.

ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యం శాశ్వతంగా శిక్షించే ధోరణిలోనే మునిగిపోయింది.

ప్రజలను, ముఖ్యంగా అసమ్మతి వాదులను లొంగదీసుకునే సమర్థవంతమైన పద్ధతిని అనుసరిస్తున్నారు.

వాళ్ళకు న్యాయాన్ని తిరస్కరిస్తూ, ఎక్కడ తగులుతుందో అక్కడ కొడుతున్నారు.

రాజ్యం నైతికత అనే గుర్రం పైన స్వారీ చేస్తూ, ఈ విధానానికి నేర న్యాయవ్యవస్థను తెలివిగా వాడుకుంటూ దుర్వినియోగం చేస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆరోపణలకు సమాధానంగా విదేశీ వ్యవహారాల శాఖ స్టాన్ స్వామి కస్టడీ మృతిపైన 'అన్నీ చట్టప్రకారమే జరుగుతోంది' అని ప్రకటించింది.

భారత ప్రభుత్వ ప్రాథమిక ధ్యేయం ఏమిటంటే, ప్రజలను భయపెట్టి, శాశ్వతంగా లొంగదీసుకోవడమే.

ఏళ్ళ తరబడి శిక్ష పడవచ్చు, దశాబ్దాల శిక్ష పడవచ్చు కానీ, నేర న్యాయ వ్యవస్థలో విచారణ విధానమే ఒక పెద్ద శిక్ష.

### శిక్షించడానికి, లొంగదీసుకోడానికి చట్టాలు

ముఖ్యంగా శిక్షించడానికి, లొంగదీసుకోడానికే భారత ప్రభుత్వం చాలా చట్టాలను చేసింది.

దేని గురించైనా సరే మీ పైన కేసు పెట్టడానికి ఏ చట్టం పనికొస్తుందో అన్వేషిస్తుంటారు.

ప్రజలను అంతర్గతంగా అణచివేయడానికి, తమ వలస దేశంలో బ్రిటిష్ వారు మితిమీరిన చట్టాలను తెచ్చారని 19వ శతాబ్దంలోనే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హాలోవే హెచ్చరించారు.

అతని మాటలను సామ్రాజ్యవాదులు పెడచెవిన పెట్టారు.

భారత ప్రభుత్వం ఆ వలస కాలాన్ని పట్టుకు వేలాడడమే కాకుండా, ఆ చట్టాలను తుచ తప్పకుండా అమలు చేస్తోంది.

దేశ ద్రోహం, ఉపా చట్టాల గురించి అందరికీ తెలుసు కనుక వాటి గురించి ప్రత్యేకంగా మాట్లాడవలసిన అవసరం లేదు.

అతి తక్కువ శక్తిగల కొన్ని భారత ప్రభుత్వ చట్టాలు కూడా బాగా రాణిస్తున్నాయి.

1857 నాటి సిపాయిల తిరుగుబాటు నేపథ్యంలో, తిరుగుబాటు ప్రచారం నుంచి సైన్యాన్ని రక్షించడానికి 1860లో

భారత శిక్షాస్మృతిలోని 505వ సెక్షన్‌ను రూపొందించారు.

స్వతంత్ర భారత దేశంలో కూడా పుకార్ల ద్వారా సైన్యాన్ని లొంగదీసుకోవడానికి ఎవరో ఒకరు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని ఇందిరా గాంధీ భావించింది.

నియంతృత్వ రాజ్యానికి ప్రజాస్వామ్యమనే ముసుగు వేయడానికి ఈ సెక్షన్లు ప్రయత్నించాయి.

ఎవరైనా సరే ఏం చేసినా హింసించడానికి 1969 లో, చట్టం 35లోని సెక్షన్ 3 ను ఆమె సవరించింది.

### చట్టాలు లేకపోవడం వారి అవసరాలకు ఉపకరించింది

చిత్రహింసలు పెట్టి, క్రూరంగా, అమానుషంగా మనిషిని శిక్షించడానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ 1975 డిసెంబర్ 9 ఆమోదించిన తీర్మానం పైన భారత దేశం 1997 అక్టోబర్ 14న సంతకం చేసింది.

ఈ తీర్మానాన్ని అమలుచేయడానికి అనుగుణంగా భారత దేశం చట్టాలను చేయలేదు.

రాజకీయ అసమ్మతిని నోరుమూయించడానికి, అణచి వేయడానికి భారత రాజ్యం ఉద్దేశ్యపూర్వకంగానే ఆ చట్టాలను చేయలేదు. భారత రాజ్యానికున్న అసహనం, అభద్రత శ్రీకృష్ణుడి మేనమామ కంసుడిని గుర్తు చేస్తుంది. పుట్టిన ప్రతిబిడ్డను చూసి కంసుడు భయపడినట్టుగానే, మన ఆధునిక రాజ్యం కూడా కాలేజీ విద్యార్థులను, వయోవృద్ధులను చూసి భయపడుతోంది.

'వాళ్ళు ఎంతకాలం భయపడతారో అంతకాలం ద్వేషించ నీయండి' అని క్రూరత్వానికి మారుపేరైన రోమన్ సామ్రాజ్య నిరంకుశ చక్రవర్తి కాలిగులా అంటాడు.

గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ మాటలు 2021లో నిజమవుతున్నాయి. 'భయపడుతున్న గణతంత్రానికి' పరిపాలనలో భయం అనేది ప్రాథమిక పనిముట్టుగా కనిపిస్తోంది. ❑

*'మన తెలంగాణ' లో వచ్చిన వ్యాసం*

*'ద వైర్' సౌజన్యంతో*

---

## పెట్టుబడిదారీ విధానం సంపద వారసత్వం

**(6వ పేజీ తరువాయి)**


దాని వలన రూ.8 లక్షల కోట్లు వస్తుంది (ఎలిజబెత్ వారెన్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న కాలంలో ఆమె 5 శాతం సంపద పన్ను విధిస్తానని తన ప్రణాళికలో ప్రకటించింది. తర్వాత బెర్నీ శాండర్స్ సంపద ఎక్కువ ఉన్నకొద్దీ పన్ను రేటు ఎక్కువ ఉండే విధంగా 1 నుండి 8 శాతం వరకూ సంపద పన్ను విధించాలని ప్రతిపాదించాడు.)

ఇక వారసత్వ పన్ను సంగతి చూద్దాం. అత్యంత సంపన్నులు ఒక్క శాతం మందిలో ప్రతీ ఏటా 5 శాతం మందికి వారసత్వంగా ఆస్తి వస్తుంది (అంటే అత్యంత సంపన్నుల్లో ప్రతీ 100 మందిలో ఏడాదికి అయిదుగురు తమ వారసులకు ఆస్తులు అప్పజెప్తున్నారు అనుకుందాం). అంటే రూ.400 లక్షల కోట్లలో 5 శాతం అవుతుంది. అది రూ.20 లక్షల కోట్లు. దానిలో మూడో వంతు వారసత్వ పన్నుగా నిర్ణయిస్తే రూ. 6.67 లక్షల కోట్ల చొప్పున ప్రతి ఏటా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. జనాభాలో కేవలం ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నులపై ఈ పన్నులు విధిస్తే ప్రభుత్వానికి ఏటా రూ.14.67 లక్షల కోట్లు వస్తాయి. ఇది మన జిడిపిలో 7 శాతం.

మన దేశం సంక్షేమ రాజ్యంగా ఉండాలంటే (1) అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో చౌకగా ఆహారాన్ని పొందగలిగే హక్కు, (2) అందరికీ ఉపాధి ఏడాది పొడవునా పొందే హక్కు, (3) అందరికీ ఉచితంగా వైద్యసేవలు అందేలా ఆరోగ్య హక్కు, (4) అందరికీ ఉచితంగా యూనివర్సిటీ స్థాయి దాకా విద్య పొందే హక్కు, (5) వృద్ధాప్యంలో, అంగవైకల్యంలో జీవించడానికి అవసరమైన మోతాదులో పెన్షన్ పొందే హక్కు ఉండాలి. ఈ అయిదు హక్కులూ అమలు కావాలంటే ప్రస్తుత జిడిపిలో 10 శాతం అదనంగా వనరులు అవసరమౌతాయి. ఈ అదనపు 10 శాతాన్ని ప్రభుత్వం ఖర్చు చేయగలిగితే, అలా ఖర్చయిన మొత్తం నుండి వివిధ పన్నుల రూపంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు కనీసం 15 శాతం అదనంగా తిరిగి వస్తుంది. ఆ 15 శాతాన్ని మినహాయించి తక్కిన 85 శాతాన్ని అదనపు పన్నుల రూపంలో వసూలు చేస్తే చాలు. పైన తెలిపిన లెక్కల ప్రకారం సంపద పన్ను, వారసత్వ పన్ను వసూలు చేస్తే వచ్చే మొత్తం అందుకు సరిపోతుంది.

అంటే, కేవలం ఒక్క శాతం జనాభాగా ఉన్న అత్యంత సంపన్నులపై రెండే రెండు రకాల పన్నులను విధిస్తే మన దేశాన్ని సంక్షేమ రాజ్యంగా మార్చవచ్చు. మనది పేద దేశమని, ప్రజలు అనుభవించే దుర్భర పరిస్థితులను మార్చడానికి కావలసిన ఆర్థిక వనరులు లేవని ఎవరైనా అంటే అది శుద్ధ తప్పు. ❑

*ప్రజాశక్తి సౌజన్యంతో...*



# నిఘా నీడ - మోడీ సర్కార్

**కె. శాంతారావు**

గోడలకు చెవులుంటాయి. నిఘా నీలి నీడలు నీ చుట్టూ తానే నీకు తెలియకుండా పరుచుకుంటాయి. కంటికి కన్పించని రహస్య కెమెరాలు, మైక్రోఫోన్‌లు నీ చేతల్ని, నీ మాటల్ని కడకు నీ శ్వాసను కూడా పసికడతాయి. ఇదేదో డిటెక్టివ్ కథ కాదు. జేమ్స్ బాండ్ సినిమా అంతకన్నా కాదు. భారత రాజకీయ రంగాన ప్రమాదభరితంగా జరుగుతున్న క్రీడ.

పెగాసస్ స్పైవేర్ ద్వారా ఈ చట్ట విరుద్ధమైన నిఘా జరుగుతున్నది. ఈ హ్యాకింగ్ (నిఘా) బాధితుల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, వివిధ రాష్ట్రాల్లో బీజేపీ గెలుపునకు అడ్డం పడ్డాడని భావిస్తున్న ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత కిషోర్ వారితో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టే మీడియా, పాత్రికేయ ప్రముఖులు, మానవ హక్కుల ఉద్యమ కార్యకర్తలు ఉన్నారు. దాదాపు మూడువందల మంది కీలక వ్యక్తులపై ఈ నిఘా జరుగుతున్నదనేది వార్తా కథనం.

'ద వైర్' అనే వార్తా సంస్థ ఈ కథనాన్ని ప్రచురించింది. కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్ అశోక్ లావాసా, పశ్చిమబెంగాల్ మమతాబెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, ప్రముఖ వైరాలజిస్ట్ గగన్‌దీప్ కాంగ్, ఎన్నికల వాచ్‌డాగ్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎ.డి.ఆర్) వ్యవస్థాపకుడు జగదీష్ ఖర్‌లతో పాటు, స్వపక్ష కేంద్ర మంత్రులు అశ్వినీవైష్ణవ్, ప్రహ్లాద్ సింగ్ ఈ నిఘా నీడలో ఉన్నారని తెలపడం గమనార్హం.

తమను విమర్శించే వారిపై మోడీ సర్కార్ నిఘా పెట్టిందని, అందుకోసమే ఇజ్రాయిల్ సంస్థ ఎస్.ఎస్.ఓ. రూపొందించిన పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించిందని అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్ట్ కూడా ఈ సందర్భంలో ఉటంకించడం, విషయాన్ని రూఢపరుస్తున్నది. పెగాసస్ అనేది ఇజ్రాయిల్‌కు చెందిన టెక్నాలజీ సైబర్ సెక్యూరిటీ సంస్థ (ఎస్.ఎస్.ఓ) రూపొందించిన ఓ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం. స్మార్ట్ ఫోన్‌ల నుండి రహస్యంగా సమాచారం సేకరించేందుకు ఈ ప్రోగ్రాం పనికి వస్తుంది. అప్పుడు క్షణాల్లో వ్యక్తిగత సమాచారం అంతా వారికి తెలియకుండానే వేరే వారి గుప్పిట్లోకి చేరిపోతుంది.

2010లో రూపొందించిన ఈ ప్రోగ్రాంను దాదాపు 50 దేశాలు వాడుతున్నాయి. ఉగ్రవాద నేరాలను పసిగట్టి, అదుపులో ఉంచేందుకే ఈ ప్రోగ్రాంను డిజైన్ చేశామని, నమ్మకమైన మిత్ర ప్రభుత్వాలకు మాత్రమే ఈ సాఫ్ట్‌వేర్‌ను విక్రయిస్తామని ఆ సంస్థ తెలుపుతున్నది. కాగా, ఆ 50 దేశాల్లో వెయ్యికి పైగా వ్యక్తుల నెంబర్లు ఈ ప్రోగ్రాం ద్వారా హ్యాక్ చేశారని, వారిలో 600 మంది రాజకీయవేత్తలు, 189 మంది జర్నలిస్టులు, 85 మంది మానవ హక్కుల ఉద్యమకారులు ఉన్నారని వాషింగ్‌టన్ పోస్ట్ వివరించింది.

అధికారం చేజారిపోతున్నదనే భయంతోనే మనదేశంలో మోడీ ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు వడిగడుతున్నదనేది రాజకీయ పరిశీలకుల భావన. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవం, ప్రైవసీ ప్రాథమిక హక్కుల్లో భాగమే. ఒక పక్క రాజ్యాంగవిరుద్ధ చట్టాలు అమలు కావడం, మరో పక్క చట్టవ్యతిరేక నిర్బంధాలు యదేచ్ఛగా సాగుతున్న ఈ దశలో ఈ నిఘా ఉపద్రవం తెరపైకి వచ్చింది.

విదేశీసంస్థలకు భారత ప్రముఖుల ఆంతరంగిక సమాచారం అప్పజెప్పడం ఏమిటని, దేశ భద్రతకు భంగం కలిగించే ఈ చర్యలు దేశ ద్రోహం నేరంతో సరితూగవా..? అనే విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మీ ఫోన్‌లో ఉన్న ప్రతిదాన్ని ఆయన (మోడీ) చదివేస్తున్నాడు అని రాహుల్‌గాంధీ అంటే, చివరకు 'మీ పడకగది ముచ్చట్లు కూడా మోడీ సర్కార్ వినగలదు. తస్మాత్ జాగ్రత్త' అని కాంగ్రెస్ నేత రణ్‌దీప్ హెచ్చరించారు. ఇలా భారతీయులపై అక్రమంగా నిఘా పెట్టే అధికారం మీకు ఎవరిచ్చారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఆగ్రహంతో ప్రశ్నించింది.

☞ మిగతా 15వ పేజీలో

# మతాతీత నైతిక ప్రవర్తన కావాలి..!




డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్సు ప్రొఫెసర్


Religious extreme pressures in Scientist Einstein 'దైవ సిద్ధాంతాన్ని వదిలి నైతిక విలువల్ని స్థాపించాలి!' అని అన్నాడు మహాశాస్త్రవేత్త ఐన్‌స్టీన్.

న్యూయార్క్ మహానగరంలో సండే స్కూల్‌లో ఆరో తరగతి చదివే ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఐన్‌స్టీన్‌కు ఒక ఉత్తరం రాశాడు. అందులో ఒక ప్రశ్న ఉంది. "శాస్త్రవేత్తలు ప్రార్థన చేస్తారా?, చేస్తే దేని కోసం చేస్తారూ?" అని!. దానికి ఐన్‌స్టీన్ ఇలా సమాధానమిచ్చాడు. ''ప్రకృతి సూత్రాలకనుగుణంగా ప్రతిదీ జరుగుతూ ఉందన్న భావన మీద శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయి. అందువల్ల ప్రార్థనతోనో, అతీంద్రియ శక్తులతోనో, ఆరాధనతోనో సహజ పరిణామాల్ని ప్రభావితం చేయవచ్చని ఏ పరిశోధకుడూ నమ్మడు అని ఐన్‌స్టీన్ వివరణ ఇచ్చాడు. మానవుడు సనాతన ఆలోచనా విధానాన్ని పునాదులతో పెకిలించి, శాస్త్రీయంగా, హేతుబద్ధంగా నూతన ఒరవడిలో సరికొత్త ఆలోచనాధారను ప్రపంచ మానవాళికి అందజేసిన ప్రఖ్యాత శాస్త్రవేత్తల్ని, సామాజిక తత్త్వవేత్తల్ని వేళ్ల మీద లెక్కబెట్టొచ్చు. ఛార్లెస్ డార్విన్ తన జీవ పరిణామ సిద్ధాంతంతో సృష్టి రహస్యాన్ని ఛేదించాడు. కార్ల్‌మార్క్స్ 'పెట్టుబడి'లో అదనపు విలువకున్న ప్రాముఖ్యతను ఆవిష్కరించి పెట్టుబడిదారీ వ్యవస్థను తూర్పారబట్టాడు. సిగ్మండ్ ఫ్రాయిడ్ 'మనో విశ్లేషణ' ఫలకంపై కొత్త ఆలోచనల్ని రూపుకట్టి సరికొత్త చర్చలకు తెర లేపాడు. ఆ కోవకు చెందిన విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ భౌతిక శాస్త్రంలో 'సాపేక్ష సిద్ధాంతం'తో సంచలనం సృష్టించాడు. ఐన్‌స్టీన్ దృష్టిలో దేవుడంటే ప్రకృతి, ప్రకృతి ధర్మాలు మాత్రమే! ఆయన అతీంద్రియ శక్తుల్నిగానీ, క్రైస్తవ మతంలోని ట్రినిటీని గానీ, ఏసుక్రీస్తు మహిమల్ని గానీ, ఆత్మ అమరత్వాన్ని గానీ, గ్రహ బలం గురించి గానీ ఎప్పుడూ నమ్మలేదు. "దేవుడు ఈ విశ్వంతో ఎప్పుడూ ఆటలాడుకోడు" అని ఐన్‌స్టీన్ తరచుగా అంటుండేవాడు.

విశ్వంలో యాదృచ్ఛికమైన గతులుండవు. గణిత సూత్రాలకు అనుగుణంగానే ప్రకృతి నడుస్తూ ఉండి అని ఖచ్చితమైన అభిప్రాయం ఉన్నవాడాయన. ఆయన "మతం" అనే మాటకు మరొక అర్థం చెప్పాడు. దేవుడితో సంబంధం లేకుండా మనిషి నైతికతతో మెలిగి, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే 'మతం' అన్నాడు. ఆ అర్థంతోనే మతం అభిమతం మానవాళికి అవసరమన్నాడు. అయితే ఈ అంశాన్ని ఆయన చెప్పిన స్థాయిలోకి వెళ్లి ఆలోచించాల్సి ఉంటుంది. అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మతం, దేవుడు అనే మూఢత్వంలో కొట్టుకుపోయే జనానికి ఈ విషయం అర్థం కావడం కష్టమే! అయితే అర్థం కానంత క్లిష్టమైంది కూడా కాదు. వంశపారంపర్యం గా జీర్ణించుకుంటూ వచ్చిన సనాతన భావ జాలాన్ని కొంచెం పక్కన పెట్టి, మెదడులో ఏ మూలో దాక్కుని ఉన్న హేతువును నిద్రలేపి, విశాల హృదయంతో కొంచెం కొత్తగా ఆలోచిస్తే చాలు. ఐన్‌స్టీన్ భావం మనకు అందుబాటులో కొస్తుంది.

"మన ఈ మెటీరియలిస్టిక్ యుగంలో మానవాళి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న, తపన పడుతున్న శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైజ్ఞానిక రచయితలే అత్యంత విశ్వసనీయమైన మతస్థులు" అని అన్నారాయన. మళ్లీ ఈ అంశాన్ని కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వాడుకలో ఉన్నట్లుగా 'మతస్థులు' అనే పదాన్ని 'ఒక మతాన్ని నమ్మేవారు' అని అర్థం చేసుకోగూడదు. ఒక మహాశాస్త్రవేత్త ఉద్దేశాన్ని, స్థాయిని కొంతైనా అర్థం చేసుకోవాలని వైజ్ఞానిక స్పృహతో ప్రయత్నించే వారికి, తహతహలాడే వారికి తప్పక అర్థమవుతుంది. మౌఢ్యం గుంజకు తమని తాము కట్టేసుకున్న వారికి అర్థం కాకపోవచ్చు. బంధనాల్ని తెంచుకుని స్వేచ్ఛగా ముందుకొస్తే అర్థమవుతుంది. వ్యక్తులు ఊహించుకున్న 'దేవుణ్ణి' ఐన్‌స్టీన్ ఏనాడూ నమ్మలేదు. ఆ విషయాన్ని ఆయన చాలా సందర్భాల్లో విస్పష్టంగా చెప్పారు కూడా! "తను సృష్టించిన వాటిని తానే ఆదుకోలేక, మళ్లీ తనే శిక్షించే దేవుణ్ణి నేను ఊహించుకోలేను. హేతువుకు, భౌతిక శాస్త్ర సూత్రాలకూ వ్యతిరేకంగా ఆయన చూపే లీలల్ని కూడా నేను

ఊహించుకోలేను. అసలు దేవుడంటే ఎవరు? మనిషి బలహీనతకు ప్రతిబింబం! మనిషి భయంలోంచి, అజ్ఞానం లోంచి, ఊహల్లోంచి, భ్రమల్లోంచి రూపుదిద్దుకున్న భగవంతుడు చూపిన లీలలకు, లేదా చూపాడని చెప్పుకుంటున్న మహిమలకు ఆధారాలే లేవు. అలాంటప్పుడు మనం వాటిని నమ్మేదెట్లా?" అన్నది ఐన్‌స్టీన్ సంధించిన ప్రశ్న!

దేవుడనే ఊహ మానవ ప్రాథమిక శాస్త్రాల (రచనల) కల్పన. దాన్ని ఆయన ఎప్పుడూ సీరియస్ తీసుకోలేదు. మానవాతీత శక్తిగా కూడా పరిగణించలేదు. అసంపూర్ణంగానైనా, వినయంగా నమ్రతతో గ్రహించే ఈ విశ్వం యొక్క క్రమబద్ధత, దాని సామరస్యంలోని అందం మానవాళిని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఆ ఆశ్చర్యాన్ని ఆనందించాలి. ఆస్వాదించాలి. అనుభవించాలి. ఐన్‌స్టీన్ అదే చేశాడు. అదే చేయమన్నాడు. అంతేకాని మరొకటి కాదు. మతానికీ శాస్త్రానికి మధ్య జరుగుతున్న ఘర్షణకు మూల కారణం వ్యక్తిగత దైవ విశ్వాసం. వైజ్ఞానిక శాస్త్రాలకు రుజువులున్నాయి. దైవ విశ్వాసానికి ఉండవు. రుజువులున్న దానితో రుజువులు లేనిది ఘర్షణ పడుతోంది. రుజువులు లేని దైవ విశ్వాసం అనేది లేకపోతే మానవులంతా వైజ్ఞానిక ప్రగతిని విశ్వసిస్తారు. అప్పుడు ఘర్షణ ఉండడానికి వీలుండదు. ఇప్పుడు సమాజం ఎలా ఉందీ? వైజ్ఞానిక ప్రగతి ఫలితాలను అనుభవిస్తూ, దైవవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు కదా? అందుకే ఘర్షణ జరుగు తోంది. వైజ్ఞానిక ఫలితాలు అనుభవించకుండా దైవ విశ్వాసంలో బతకగలిగితే బతకాలి. అప్పుడు కూడా ఘర్షణ ఉండదు.

బాబాలు, స్వాములు, మాతాజీలు వగైరా సామాన్యుడి కన్నా ఎక్కువ వైజ్ఞానిక ఫలితాలు అనుభవిస్తున్నారు. మరో వైపు మూఢత్వం పెంచి పోషిస్తున్నారు. నైతికతను మరచి, అత్యంత హీనంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఘర్షణ. పోనీ ఈ ఘర్షణ తగ్గించడానికి సైన్సును సైన్సు పరిశోధనల్ని పక్కన పెడదామా అంటే ఎలా వీలవుతుందీ? సైన్సు లేనిది ఊపిరే పీల్చలేం. శ్వాస క్రియ జీవశాస్త్రంలో భాగం. ఆధ్యాత్మిక, ధార్మిక, తాత్విక ధోరణులలో ఎటు నుంచి ఎటు తిప్పుచెప్పినా దైవ భావన ఉట్టి విశ్వాసమే! ఉట్టి విశ్వాసంతో సంతానోత్పత్తి జరగదు. ఆహారోత్పత్తి జరగదు. సమాజం పెరగదు. ఎదగదు. విశ్వ రహస్యాల్ని, జీవ రహస్యాల్ని మనిషి అర్థం చేసుకుంటూ ఒక్కొక్కటి ఆవిష్కరించు కుంటూ వస్తున్నాడు. గనుకనే, మనం ఈ అత్యాధునిక సాంకేతిక యుగంలో ఉన్నాం. మునుల వల్లనో, రుషుల వల్లనో, ధార్మిక ఆధ్యాత్మిక గురువుల వల్లనో ప్రపంచం పురోగతి సాధించలేదు. అలాగే మత విశ్వాసాల వల్ల ఘర్షణలు జరిగాయే గాని, శాంతి స్థాపించబడలేదు.

"ఎవరో నమ్ముకున్న దేవుడు లేడని నేనెందుకు నిరూపించాలి? అది నా పని కాదు. నమ్ముతున్న వారే వారెందుకు నమ్ముతున్నారో నిరూపించుకోవాలి. దేవుడున్నాడని మాట్లాడితే నేనొక అబద్ధాలకోరునవుతాను. అయినా, వాస్తవాలకు నిరూపణలు వెతకొచ్చు. అవాస్తవాలకు నిరూపణ లెక్కడ?" అని ప్రశ్నించిన ఐన్‌స్టీన్ మత ప్రచారకులకు కొన్ని సూచనలిచ్చాడు. మత ప్రచారకులంతా తమ వ్యక్తిగత దేవుడి సిద్ధాంతాన్ని వదిలేయాలి, తమ ఆధీనంలో ఉన్న పాప పుణ్యాల్ని, భయాల్ని, నిరాశవాదాన్ని, పునర్జన్మల్ని మొత్తానికి మొత్తంగా తుడిచేసుకోవాలి. నైతిక విలువల్ని కాపాడే పోరాటంలో సామాన్యులతో కలిసి రావాలి. 'కార్యకారణ సూత్రం'పై పని చేసే ఈ విశాల విశ్వాన్ని అర్థం చేసుకోవాలి. జరిగిన జరుగుతున్న పరిణామాల మీద అవగాహన పెంచుకోవాలి. మతంపై నుండి దృష్టి మరల్చి, సామాజిక అసమానతలపై దృష్టి పెట్టాలి అని! మానవుడి అమరత్వంపై తనకు నమ్మకం లేదని, నీతి అనేది మానవాతీత శక్తి కాదని, మానవుడికి సంబంధించిందేనని అది అతడు తన ఆత్మ విశ్వాసంతో సాధించుకోవచ్చని ఈ విషయంలో దేవుడి ప్రమేయమే లేదని కరాఖండిగా చెప్పిన ఈ శాస్త్రవేత్త, మరణానంతర జీవితాన్ని కొట్టి పారేశాడు. భౌతికంగా మనిషి చనిపోయిన తర్వాత జీవి బతికే ఉండడం ఆత్మలు తిరుగాడుతూ ఉండడం మూఢ నమ్మకాలేనన్నాడు.

మనిషి అంతర్గత అనుభవాలన్నీ పునరుత్పత్తులతో, సునిశిత భావ సముచ్చయంతో ముడిపడి ఉంటాయి తప్పితే, దేహమే లేకపోయినప్పుడు ఆత్మకు అర్థమే లేదు. మానసికంగా బలహీనులైన వ్యక్తులు ఆత్మన్యూనతా భావంతోనూ, భయంతోనూ లేదా ఎదుటి వారిని మోసగించాలన్న కుట్రతోనూ అలాంటి ఆలోచనల్ని ప్రచారం చేస్తుంటారు. లేని ఆత్మల్ని జనం గుండెల్లో పదిలపర్చుతుంటారు. మతం గురించిన ప్రస్థావనలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక చోట ఇలా రాసుకున్నాడు. మతపరమైన తీవ్ర ఒత్తిళ్లను ఆయన బాల్యంలోనే ఎలా అనుభవించాడో గుర్తు

చేసుకున్నాడు" నాకు పన్నెండో యేట నుండి పాఠశాల మీద, ఉపాధ్యాయుల మీద అపనమ్మకం ప్రారంభమైంది. స్కూలు నన్ను ఫెయిల్ చేసింది. నేను స్కూలును! ఉపాధ్యాయులెప్పుడూ మిలట్రీ సార్జంట్లలాగ ప్రవర్తించేవారు. నాకు కావాల్సింది నన్ను నేర్చుకో నిచ్చేవారు కాదు. ఆ పోటీ తత్వం నాకు నచ్చేది కాదు. ముఖ్యంగా క్రీడల్లో దీనివల్ల వాళ్లు నన్ను వెళ్లిపొమ్మని అనేకసార్లు ఆదేశించారు. మ్యూనిచ్‌లో అది ఒక క్యాథలిక్ స్కూలు. ఇక చెప్పేదేముంది? నా జ్ఞాన తృష్ణను మెలిక వేసి తిప్పుతూ, తిప్పుతూ ఉండేవారు. ప్రెయిజ్ ద గాడ్! పైగా మార్కులు, గ్రేడ్‌లే వారి కొలబద్దలు. అలాంటి వ్యవస్థతో ఉపాధ్యాయులు పసి కూనలైన చిన్నారుల మనోభావాల్ని, ఉత్సాహాల్ని, అభిరుచుల్ని ఎలా బేరీజు వేయగలరో నాకు తెలిసేది కాదు." ఐన్‌స్టీన్ బాల్య అనుభవాలకు, సమకాలీనంలో మన బాలబాలికల జీవితానికి పెద్దగా తేడా లేదు. మిషనరీ స్కూలయితే ప్రేయర్. మదరసా అయితే అల్లా, వేద పాఠశాల అయితే వేదాలు. అంతే. మత ప్రమేయం లేకుండా విచక్షణా జ్ఞానాన్ని పెంచే చదువులున్నాయా? వాస్తవాలేవో, భ్రమలేవో, కల్పనలేవో పిల్లలకు విడమరిచి చెపుతున్నామా? మతం సాధించే విజయానికి, విద్యా వ్యవస్థ అపజయానికి నేరుగా అవినాభావ సంబంధం ఉంది.

సరే, గతం గడిచిపోయింది. ఏం చేసినా దాన్నిక మార్చలేం కానీ, సుఖాంతమయ్యే ఒక కొత్త ప్రారంభానికి మనం బీజం వెయ్యొచ్చు కదా? ఆ దిశలో మనం ఎందుకు ఆలోచించ గూడదూ? థియోసఫీ, స్పిర్చువలిజం వంటివన్నీ మత గ్రంథాల చుట్టూ తిరిగే గందరగోళాలే! అసలు మత గ్రంథాలన్నీ అవాస్తవాలు, కల్పిత గాథలు అని అనుకున్న వారికి కొత్త ఆలోచనలు వచ్చే అవకాశముంటుంది. గాను గెద్దుల్లా కళ్లు మూసుకుని తిరిగే వారికి, అందులోనే శాంతి, సౌఖ్యం ఉన్నాయని అనుకునే వారికి మనం ఏమీ చెప్పలేం. వైజ్ఞానిక శాస్త్రం నైతికతను కించపరుస్తుందన్న అపవాదు ఉంది. కానీ, అది నిజం కాదు! మానవుడి నైతిక ప్రవర్తన సానుభూతి, విద్య, వైద్యం, సామాజిక అవసరాలు, స్నేహ బంధనాల మీద అధారపడి ఉంటుంది. అందులో మతానికి చోటే లేదు. అవసరమే లేదు. మత ప్రమేయం లేకుండా కూడా, మానవులుగా, మహనీయులుగా గొప్ప విలువలతో జీవించిన వారున్నారు. మరణం తర్వాత లభించే అనుగ్రహం కోసమో, శిక్షలకు గురవుతామన్న భయంతోనో మనిషిని నిలదీయడం గాని, కృంగదీయడం గాని, మోసగించడం గాని, అమానుషం! అపరిపక్వం! అసంబద్ధం!! ❑

## నిఘా నీడ - మోడీ సర్కార్

**(12వ పేజీ తరువాయి)**

అధికార పీఠంపై ఉన్నవారు ఆయా వ్యక్తుల రహస్య సమాచారాన్ని సేకరించి తిమ్మిని బమ్మిన చేయవచ్చు. బెదిరించ వచ్చు. బ్లాక్ మెయిల్ చేయవచ్చు. మారు మాట్లాడకుండా లొంగ దీసుకోవచ్చు. ఇది అప్రజాస్వామ్యమే కాక చట్ట విరుద్ధం కూడా. తమను విమర్శించే వారిని, తమపై ఆరోపణలు చేసేవారిని సూటిగా ఎదుర్కొలేక పాల్పడే కుట్రపూరిత చర్య ఇది.

గతంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోరుపై లైంగిక చర్యల ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఆరోపణలు చేసిన ఆమెపైనా, వారి కుటుంబ సభ్యులు పదకొండు మందిపైనా ఇలాగే నిఘా పెట్టారని వార్తలు వచ్చాయి. దీనిపై మీడియా వివరణ కోరితే ఆయన నిరాకరించారు.


2019లో కర్నాటకలో జేడీయూ, కాంగ్రెస్ కలిసి ఏర్పాటు చేసిన కుమారస్వామి ప్రభుత్వం కూలిపోవడానికి కూడా ఈ పెగాసస్ నిఘానే కీలకపాత్ర పోషించిందనేది తాజా వార్త. అందుకే అక్కడ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు వర్షాకాల సమావేశాలు దద్దరిల్లుతున్నాయి.

మన చేతిలోని మన స్మార్ట్‌ఫోనే మనను బలికొనే మారణాయుధం అవుతున్నప్పుడు భద్రతకు ఆస్కారమెక్కడి అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వాలను గద్దె దింపాలని, ప్రత్యర్థులను నిట్టనిలువునా నిర్వీర్యం చేయాలని యత్నిస్తే ప్రజాస్వామ్యానికి చోటెక్కడి ప్రజలకు ఏమాత్రం స్వేచ్ఛ లభిస్తుందో అదే ప్రజాస్వామ్యానికి కొలమానం అన్న అబ్రహం లింకన్ మాటలు అక్షర సత్యం. ❑

# కాషాయీకరణ దిశగా చరిత్ర

అనువాదం : బోడపట్ల రవీందర్

- జియా ఉస్సలామ్



యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదివే విద్యార్థుల కోసం రచించిన చరిత్ర కొత్త సిలబస్ 'పాత సీసాలో పాత సారా' లాగా ఉంది. ప్రాచీన భారతదేశ చరిత్రను శ్లాఘిస్తూ, మొగలులను దురాక్రమణదారులుగా పేర్కొంటూ, చరిత్రను హిందూ, ముస్లిం, బ్రిటిష్ కాలాలుగా ఒక సరళమైన, తప్పుడు వర్గీకరణ చేశారు.

'పునరుద్ధరణ సమతుల్యతను' 'చరిత్రను', మార్క్సిస్ట్ చరిత్రకారులుగా భావించబడుతున్న వారి అదుపు నుంచి పూర్తిగా తప్పించే లక్ష్యంతోనే ఈ మార్పులు చేర్పులు జరుగుతున్నాయని చెపుతున్నప్పటికీ, జేమ్స్ మిల్ ప్రతిపాదించిన చరిత్ర వలస విభజన పునరుద్ఘాటన ఇది. మొదట చరిత్రను మార్చే ప్రయత్నంలో భాగంగా 1977లో, 1999లో ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వంలోని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి మురళీ మనోహర్ జోషి, భారతీయీకరణ ముసుగులో చరిత్రను కాషాయీకరణ చేయడానికి చేసిన ప్రయత్నాల మార్గంలోనే ఈ ప్రస్తుత రచన కూడా కొనసాగుతుంది. ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా పాఠశాల స్థాయిలో మార్పులు చేయాలని అప్పుడు జోషీ ప్రయత్నించాడు. ఇప్పుడు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల స్థాయి సిలబస్‌లో మార్పులు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కొత్త రచనలను తన వెబ్‌సైట్‌కు పరిమితం చేస్తూ ప్రచారంలో పెట్టిన యూజీసీ, కొత్త సిలబస్‌ను ఎప్పుడు, ఎలా అమలు చేయాలనే విషయంపై మాత్రం మౌనంగా ఉంటుంది. అయినా విద్యావిషయక సమూహం (ఎకడమిక్ కమ్యూనిటీ) గాలి ఎటు వైపు వీస్తుందనే విషయాన్ని చాలా తొందరగా అర్థం చేసుకుంటుంది. కొత్త సిలబస్ తగినంత స్థలాన్ని, సామర్థ్యాన్ని ప్రాచీన భారతదేశానికే కేటాయించింది. ఆర్యులు మన దేశీయ మూలాలకు చెందిన వారే అనే విషయాన్ని ఈ సిలబస్ పదే పదే పునరుద్ఘాటిస్తుంది. అన్ని విధాలా కీర్తీ, గౌరవం, ఆర్థికాభివృద్ధి, శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెంది, శాశ్వతమైన శాంతి సౌఖ్యాలతో ప్రాచీన భారతం విలసిల్లినట్లు పేర్కొంటుంది. గుప్త సామ్రాజ్యాన్ని భారతదేశ చరిత్రలో స్వర్ణ యుగమని గొప్పగా పేర్కొన్నారు. కానీ ప్రాచీన చరిత్రకు సంబంధించిన అంశాలలో అపారమైన అనుభవం ఉన్న డీ.ఎన్.ఝా, భారతదేశ చరిత్రలో అసలు ఒక స్వర్ణయుగం అనేదే లేదనే విషయాన్ని తెలిపాడు.

బాబర్, ఆయన వారసులు చేసిన శాస్త్ర విజ్ఞాన అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి, ఎర్రకోట, తాజ్‌మహల్ లాంటి అద్భుతమైన నిర్మాణాల సృష్టిని, చేసిన సేవలను గుర్తించకుండా మధ్య యుగాల భారతదేశ చరిత్రకు ఉన్న ప్రాముఖ్యతను తక్కువ చేసి చూశారు. ఈ కొత్త సిలబస్‌లో, ఆర్.ఎస్.శర్మ, ఇర్ఫాన్ హబీబ్ లాంటి ప్రఖ్యాతి గాంచిన చరిత్రకారుల రచనలను విద్యార్థులు అనుసరించే జాబితా నుండి తొలగించారు. కొన్ని తరాలుగా విద్యార్థులు ప్రథమ వాచకంగా ఉపయోగించుకుంటున్న ప్రొ.రొమిల్లా థాపర్ రచించిన ప్రాచీన భారతదేశ చరిత్రను కేవలం రెండు పుస్తకాలకే పరిమితం చేశారు. మార్క్సిస్ట్ భావాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని భావించబడుతున్న ఈ చరిత్రకారులు తరచుగా పాలక వర్గాల ఆగ్రహానికి గురవుతున్నారు. ఢిల్లీకి చెందిన చరిత్రకారుల సమూహం గతంలో 'కమ్యూనలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ద హిస్టరీ టెక్స్ట్ బుక్స్ కాంట్రవర్సీ' అనే రచనతో ముందుకొచ్చింది. దీని రచయితలుగా ఉన్న బిపిన్ చంద్ర, ఇర్ఫాన్ హబీబ్, రొమిల్లా థాపర్, అర్జున్ దేవ్, మృదులా ముఖర్జీ, ఆదిత్యా ముఖర్జీ, సుమిత్ సర్కార్‌లు భారతదేశ చరిత్రకు సంబంధించిన అన్ని వాదనలను ముందు పెట్టారు.

"చరిత్ర గురించి మతతత్వంతో చేస్తున్న వ్యాఖ్యానాలు, భారత దేశంలో ప్రధానమైన మతతత్వ భావజాలాన్ని ఏర్పరుస్తాయి. శాస్త్రీయ, లౌకిక చరిత్రపైన బీజేపీ నిరంతరం ఎందుకు దాడిని తీవ్రం చేస్తుంది? ఎందుకు చరిత్ర రచనలు ఒక్కసారిగా మతతత్వ, లౌకిక రాజకీయ భావజాల శక్తుల మధ్య యుద్ధభూమిగా మారాయి? 1930, 40 దశకాలలో ముస్లిం మతతత్వ వాదులు ద్విజాతి సిద్ధాంతాన్ని (వారు మైనారిటీగా ఉన్న వారిపైన మెజారిటీ మతస్థులు ఆధిపత్యం చెలాయిస్తారనే భయంపై ఆధారపడి నప్పటికీ) ధృవీకరించుకునేందుకు చరిత్రను ఉపయోగించు కున్నారు. కానీ హిందూ మతతత్వవాదులు ఈ విషయంలో ఒక ప్రతికూలతతో బాధపడ్డారు. 1947కు ముందు జనాభాలో సుమారు 70 శాతంగా, 1947 తరువాత 80 శాతానికి పైగా ఉన్న హిందువులు, ముస్లింల చేత అణచివేయబడతారని ఎలా భయపడతారు? లేదా ముస్లింల నుండి వారికి ఎలా ముప్పు ఏర్పడుతుంది? దీనికి సమాధానం, చరిత్రకు సంబంధించని, మతతత్వంతో కూడిన మధ్య యుగాల చరిత్ర వర్ణనలో దొరికింది, ఇప్పుడు దొరుకుతుందని" అప్పుడు బిపిన్ చంద్ర తెలిపాడు. ఆయన మాటలకు నేటికీ ప్రాసంగికత ఉంది.

ఈ "మతతత్వ" వర్ణనను ప్రశ్నించేందుకు ఎటువంటి ప్రయత్నం చేసినా దౌర్జన్యాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఉదాహరణకు, అమెరికాకు చెందిన చరిత్రకారిణి ఆడ్రీ ట్రష్కీ, మొగల్ చక్రవర్తి ఔరంగజేబును దేవాలయాలను నాశనం చేసిన వ్యక్తిగా, లేదా ఇస్లామిక్ క్రూరపాలకునిగా కన్నా కొన్ని ప్రత్యేకతలున్న వ్యక్తిగా చూపించినందుకు, ఆమెను అవమానించారు. ఔరంగజేబు దేవాలయాలకు నిధులు, హిందువులకు ఉద్యోగాలు ఇచ్చిన విషయాలను ఆమె ఉదహరించినప్పుడు ఎవ్వరూ పట్టించుకోలేదు. అదే విధంగా రాజేంద్ర చోళుడు దేవాలయాలను దోచుకొని, దాడులు చేసిన విషయాలను ఆమె గుర్తు చేసినప్పుడు, విద్యావిషయక బృందాలకు అవతల ఉన్న కొందరు వాటిని అంగీకరించారు.

ప్రస్తుతం సిలబస్‌లో చేస్తున్న మార్పుల్లో భాగంగా మార్క్సిస్ట్ భావజాలంతో ఉన్నారని భావించబడుతున్న చరిత్రకారుల తొలగింపుపై కేంద్రీకరిస్తున్నారు. అనేక మంది ప్రముఖ చరిత్రకారుల అభిప్రాయాలు అందరికీ తెలిసినవే, అసలు తెలియని వాస్తవం ఏమిటంటే, వారిని బలవంతంగా ఎవరూ ఏమీ ఒప్పించలేదు, అలా అని వారంతట వారు వచ్చినవారు కూడా కాదు. 1960లలో పాఠ్య పుస్తకాలను రచించే బాధ్యతను ప్రొ. బిపిన్ చంద్ర, ప్రొ. రొమిల్లా థాపర్‌లకు అప్పజెప్పిన 'ఆల్ ఇండియా ప్యానల్ ఫర్ హిస్టరీ'లో ప్రఖ్యాత చరిత్రకారులైన మహమ్మద్ హబీబ్, నీలకంఠ శాస్త్రి, తారాచంద్, సర్వేపల్లి గోపాల్ లాంటి వారంతా సభ్యులుగా ఉన్నారు. మార్క్సిస్ట్ భావజాల చరిత్రకారులు కానటువంటి వీరంతా మెరిట్ ఆధారంగానే ఎంపికయ్యారు. "వారు ఇతరులను మెకాలే పిల్లలు అని అంటున్నప్పటికీ, వారే భారతదేశ చరిత్రను హిందూ, ముస్లిం, బ్రిటిష్ కాలాలుగా విభజించిన జేమ్స్ మిల్‌కు ప్రత్యక్ష వారసులు. మధ్య యుగాలలో హిందువులు, ముస్లింల క్రూర పాలనలో అనేక బాధలు అనుభవించారనే భావన కూడా వలస పాలకుల కట్టుకథే, ఎందుకంటే ఆ క్రూర పాలన నుంచి హిందువులను బ్రిటిష్ పాలకులు విముక్తి చేశారనే విషయాన్ని బాగా ప్రచారంలో ఉంచారు. ఆ తరువాత హిందూ, ముస్లిం సమాజాలు రెండు ఎప్పుడూ యుద్ధాల్లో మునిగిపోతున్నాయనే ప్రచారం కూడా భారతదేశంలో బ్రిటిష్ వారి పాలన అవసరమే అన్న సమర్థనను సృష్టించారు. ఈ చరిత్ర యొక్క మతతత్వ వ్యాఖ్యానాలు వలసవాదుల వ్యాఖ్యానాలపై ఆధారపడి చేశారని" మృదులా ముఖర్జీ అన్నారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే, మృదులా ముఖర్జీ, ఇతరులతో, ఎవ్వరూ కొత్త రచనలకు సంబంధించిన విషయాల గురించి సంప్రదించలేదు. "కొత్త సిలబస్ అనేది, 1999లో మురళీ మనోహర్ జోషి చేసిన ప్రయత్నానికి కొనసాగింపేనని, ఈ సిలబస్ యొక్క లక్ష్యం ఏమిటో కూడా మాకు తెలియదు, దానిని యూనివర్సిటీలకు పంపిస్తారా? దానిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని చెపుతారా? అనే విషయం కూడా తెలియదు. పూర్తిగా ఇక్కడ పారదర్శకత లోపించింది. యూజీసీ ఈ సిలబస్‌ను తన వెబ్‌సైట్‌లో పెట్టిన తర్వాత ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదని" మృదులా ముఖర్జీ అన్నారు.

"1970లో కూడా ప్రొ. హబీబ్ రచనలను పాఠ్యాంశాల జాబితా నుండి తొలగించారు. 1999లో మార్క్సిస్ట్ చరిత్ర కారులుగా పిలువబడుతున్న వారి పాత్ర మసకబారింది. ఆ సమయంలో ప్రఖ్యాత చరిత్రకారుల రచనలను చదవకుండా నిరోధించడం వలన అనేక మంది విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విద్యార్థులు, సూచించిన పుస్తకాల జాబితాను అనుసరించరు. వారికి ఆన్‌లైన్ తరగతులు, ఈ-బుక్స్‌లోకి ప్రవేశం ఉంటుంది. "విద్యార్థులకు ప్రచురించిన పుస్తకాలపై ఆసక్తి ఉండదు, వారికి ఈ-బుక్స్, పీడీఎఫ్‌లు, ఆన్‌లైన్ లెక్చర్‌లు ఉంటాయి. ప్రభుత్వం ఏమి చేయాలని ప్రయత్నిస్తుంది? ఇది మూర్ఖపు సాహసం అనిపిస్తుంది. ఏ ఒక్కరూ ఒక ఆలోచనను నిలువరించలేరని" ప్రొ. ముఖర్జీ అన్నారు.

మరోవైపు విద్యావేత్తలు ఏ పనీ లేకుండా ఊరికే కూర్చోవడం లేదు. కేరళ హిస్టరీ కాంగ్రెస్ కొత్త సిలబస్‌ను ఖండిస్తూ, ఇది "చరిత్రను కాషాయీకరించే ప్రయత్నం" అని అభిప్రాయపడింది.

"యూజీసీ చరిత్ర చిత్తుప్రతి పీఠికలో, దాని లక్ష్యాలు, భారతదేశ చరిత్ర యొక్క స్థూల, సూక్ష్మ అంశాలపై పూర్తి దృష్టితో, చారిత్రక విధానాలు, చరిత్ర రచనా ఒప్పందాల పట్ల నిష్పక్షపాతను కలిగి ఉన్నాయి. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రజల, సామాజిక రూపకల్పనల విమర్శనాత్మక చరిత్రలను మినహాయించే ప్రయత్నాలు అంతిమదశకు చేరుకోవడంతో ఆ లక్ష్యాలను నెరవేర్చ డంలో వైఫల్యం చెందిందని" కేరళ హిస్టరీ కాంగ్రెస్ పేర్కొంది.

ఇరవై సంవత్సరాల క్రితం ఇర్ఫాన్ హబీబ్, 'వన్ ఇండియా, వన్ పీపుల్' కోసం రాసిన మాటలు నేటికీ ఆమోదయోగ్యమైనవే. "కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సంఘ్ పరివార్‌లు ముందుకు తీసుకొని వస్తున్న భారతదేశ చరిత్ర, గతంలో ఉన్న ప్రముఖ చరిత్రకారులు, ప్రస్తుత వృత్తిపరమైన ప్రముఖ చరిత్రకారులు చెపుతున్న చరిత్రకు చాలా భిన్నమైనదనే విషయం తెలుసుకోవడం చాలా ముఖ్యం. మితవాద చరిత్ర కారులు, వామపక్ష చరిత్రకారులపై పైచేయి సాధించేందుకు వారికి అధికారిక వనరులను కల్పించడం వలన, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన యూజీసీ, ఎన్‌ఎన్‌సీ ఈఆర్‌టీ, ఐసీహెచ్‌ఆర్‌లు భారతదేశ చరిత్రను గుర్తించి, అది భారతీయ చరిత్రకారుల మధ్య జరిగే ముఖ్యమైన విద్యావిషయక ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పడం అసంబద్ధమని" ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయపడ్డాడు. ❑

*'ఫ్రంట్ లైన్' సౌజన్యంతో*



# అస్తిత్వ చరిత్ర - అస్తిత్వ స్పృహ

**కొప్పర్తి వ్యాసానికి స్పందన**

**వకుళాభరణం రామకృష్ణ**
విశ్రాంత చరిత్ర ఆచార్యులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

*కొప్పర్తి వెంకట రమణమూర్తి రాసిన 'ఆంధ్రప్రదేశ్‌కు అస్తిత్వ స్పృహ ఉందా?' అన్న వ్యాసానికి ఆంధ్రజ్యోతిలో వచ్చిన కొన్ని స్పందనలు*

అస్తిత్వ స్పృహను పెంచి పెద్ద చేయడంలో తోడ్పడే అంశాలయిన - చరిత్ర, సంస్కృతుల పెంపుదల, మాతృ భాషాభివృద్ధి, సామాన్య, ఉన్నత విద్య అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరం. పరిశోధకులకు కామధేనువు లాంటి వేటపాలెం 'సరస్వతీ నిలయం' గ్రంథాలయం, రాజమహేంద్రవరంలోని గౌతమీ గ్రంథాలయం, నెల్లూరు వర్ధమాన సమాజ గ్రంథాలయం ఇవ్వాళ కళాకాంతులు లేక వెలవెలపోతున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో, మరెన్నో కారణాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సరే, విద్యావంతులు, మేధావులు, సృజనశీలురు ఆలోచిస్తారా? కార్యాచరణకు పూనుకుంటారా?

వ్యాసకర్త అస్తిత్వ ఆవశ్యకతను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక తెలంగాణ తన అస్తిత్వాన్ని ఎలా అభివృద్ధి చేసుకుంటూ పోతున్నదో చెపుతూ, ఆంధ్రప్రదేశ్ (కోస్తా ఆంధ్ర అని వ్యాసకర్త అన్నారు) కు అస్తిత్వపు స్పృహ ఉన్నదా అని ప్రశ్నించారు. ప్రస్తుతానికి లేదని అంటూ దానిని పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వక్కాణించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రను 'mega narrative' గానే చరిత్రకారులు చూస్తున్నారనీ అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక, తెలంగాణ 'కొత్త అస్తిత్వంతో... ఒక తాజాదనంతో అడుగులు వేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ కొత్త అస్తిత్వాన్ని సంతరించుకున్న దాఖలాలు లేవంటూ, అది పొందడానికి, 'బహుశా కొత్తపేరు అవసరం అవుతుంది' అన్నారు. 'పేరులో ఏమున్నది పెన్నిధి' అనే సూక్తినటుంచి, పేరు మార్చుకొన్నంత మాత్రాన అస్తిత్వ స్పృహ పెరుగుతుందన్న భావంలో వ్యాసకర్తకూ అంత నమ్మకం లేదేమో!

తెలంగాణలో నూతన ఉత్తేజంతో అస్తిత్వ స్పృహ పెరగడంలో ఆశ్చర్యం లేదు. తెలంగాణ ఉద్యమమే 'అస్తిత్వ ఉద్యమం'గా పరిగణించబడింది. తమదంటూ ఒక ప్రత్యేక అస్తిత్వం కోసం పోరాడుతున్నామన్న స్పృహ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అడుగడుగునా ద్యోతకమైంది.

వ్యాసకర్త స్వయంగా చరిత్రకారుడు కావడం గమనార్హం. 'భిన్నమైన చరిత్ర ఉండడం అస్తిత్వ ముఖ్య లక్షణాల్లో ఒకటి' అన్నారు. ఇక్కడ భిన్నం అనే దాన్ని ఎలా నిర్వచించుకోవాలి? ప్రాంతాల మధ్య భిన్నత్వం సహజంగానే ఉంటుంది. అది అనేక విధాల వ్యక్తమవుతుంది. చరిత్ర నిర్మాణం దాన్ని బట్టే ఉండి తీరుతుంది. తెలుగువారి చరిత్ర రచన, ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతానికి చెందినది, 20వ శతాబ్ది ఆరంభంలోనే మొదలైంది. కొమర్రాజు లక్ష్మణరావు నేతృత్వంలో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, ఈ బృహత్కార్యాన్ని తలకెత్తుకుంది. ఆ తర్వాత కొత్త ఆధారాలతో చరిత్ర రచన నిరాటంకంగా కొనసాగింది. అటు విశ్వవిద్యాలయాల్లో, మరోవైపు ఔత్సాహిక చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు ఆంధ్ర ప్రాంత చరిత్ర, సంస్కృతులను సంపన్నం చేస్తూ వచ్చారు.

ఈ సందర్భంలో ఒక ముఖ్యవిషయాన్ని ప్రస్తావించాలి. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 1976లో ప్రారంభమై వార్షిక సభలు జరిపి ప్రతి ఏడాది వివిధ విభాగాల్లో (ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక, స్థానిక, పరిశోధన) సమర్పించిన వాటిలో ఎంపిక చేసి ప్రచురించిన పరిశోధనా పత్రాల సంపుటులు 42 ఉన్నాయి. వీటిలో సభలు జరిగిన ప్రదేశాల స్థానికచరిత్రపై భాషణలున్నాయి. అవేగాక, చరిత్ర, సంస్కృతులపై లోతైన పరిశోధనలు వందల సంఖ్యలో ఉన్నాయి. డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతూ ఉంది.

ఇవి కాకుండా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 1998లో

చేపట్టి పదేళ్లపాటు శ్రమించి ప్రచురించిన, ఆంధ్రప్రదేశ్ చరిత్ర–సంస్కృతి తొమ్మిది సంపుటాలు, ఆంగ్ల–తెలుగు భాషల్లో వెలువడ్డాయి. ఈ సంపుటాలు తెలుగువారి చరిత్రను క్రీ.పూ. 5000 సంవత్సరం చరిత్ర పూర్వయుగం నుంచి క్రీ.శ. 2009 దాకా రికార్డు చేశాయి.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ చరిత్ర నిర్మాణానికి సంబంధించిన ఒక విషయం ప్రస్తావించాలి. ప్రభుత్వం నియమించిన ఇరు రాష్ట్రాల చరిత్రకారుల కమిటీలు చరిత్ర ఆధారాలకు సంబంధించిన ఇరు ప్రాంతాలకు చెందిన రికార్డులను, శాసనాలను, నాణేలను, పురావస్తు ఆనవాళ్లను, గ్రంథాలను పరిశీలించి రెండు రాష్ట్రాలకు అంగీకార యోగ్యంగా– నివేదికలు– సమర్పించాయి. ఆర్కైవ్స్‌కు చెందిన డాక్యుమెంట్లను చాలా వరకు తరలించి ఒక అద్దె భవనంలో ఉంచారు. తరలించాల్సిన రికార్డులు ఇంకా కొన్ని హైదరాబాద్‌లోనే ఉన్నాయని తెలిసింది. దీని బాగోగులు చూడ్డానికి ప్రభుత్వం నిపుణులతో ఒక కమిటీని నియమించినా, ఆ కమిటీ సమావేశం ఇంతవరకూ జరగలేదు. ఇక ఆర్కియాలజీ సంపదను ఇంతవరకూ తరలించలేదు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూడ ఇంత వరకూ విభజనకు నోచుకోలేదు.

వ్యాసకర్త మరో ముఖ్యాంశాన్ని ప్రస్తావించారు. 'ఆంధ్ర దేశం నుంచి తెలంగాణకు సాగిన ఆధునిక యుగవలసలు, వాటి అనివార్యత, పర్యవసానాల గూర్చి, నిశితంగా పరిశీలించిన విశ్లేషణలు రావాల్సి ఉంది' అని అన్నారు. – నిజమే! హైదరాబాద్ నగరం రాష్ట్ర విభజనకు ముందే, అతిపెద్ద నగరంగా, కార్పొరేట్ వాణిజ్యాల కూడలిగా రూపుదిద్దుకుంది. వివిధ, విభిన్న ఉన్నత విద్యా, పరిశోధనా కేంద్రాలు, సంస్థలు, కార్పొరేట్ ఆరోగ్య వసతులు, అన్నిటికీ మించి సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలకు కేంద్రంగా అభివృద్ధి చెందింది. ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందిన నగరాలలో హైదరాబాద్‌ను ఒకటిగా పేర్కొంటున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి ఉన్నత విద్యకు వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్, వ్యాపారాల కోసం వచ్చిన వారితో పాటు, విదేశాల్లో స్థిరపడ్డ ఆంధ్ర ప్రాంతపు వారికి కూడ అది అనువైన, నివాసయోగ్యమైన నగరంగా క్రమాభివృద్ధి చెందింది. బుద్ధిజీవులు, కళాకారులు, కవులు, సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో నగరానికొచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఆ మేరకు ఆంధ్రప్రాంతం తన బౌద్ధిక, ఆర్థిక వనరులను కోల్పోయింది. ఒక దశలో వలసాంధ్రుల పట్ల విముఖతే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కారణాల్లో ఒకటిగా చెప్పబడింది. ఈ పరిణామాల ప్రభావం ఆంధ్రప్రదేశ్ అస్తిత్వ స్పృహపై ఎంతవరకు ఉందో నిశితంగా పరిశీలించాలి.

ఆంధ్రుల (కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర) అస్తిత్వం పుట్టి, పెరిగి మద్రాసు రాష్ట్రం నుంచి విడివడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవడంతో మొదలై అభివృద్ధి చెందింది. వివరాల్లోకి వెళ్ళకుండా ప్రస్తావించాలంటే – ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం సాగిన సుదీర్ఘకాలిక ఉద్యమ సమయంలో వెలువడ్డ చరిత్ర, సంస్కృతుల సాహిత్యం, గ్రంథ ప్రచురణలు, గ్రంథాలయోద్యమం – వాటి ద్వారా ప్రజల్ని విద్యావంతులుగా, చైతన్యశీలురుగా చేయడం; సాహిత్య పరిషత్తులు, ప్రాచీనకళారూపాలు సముద్ధరణ, వామపక్ష, బ్రాహ్మణేతర ఉద్యమాల చైతన్యం– అదొక సాంస్కృతిక సంరంభం. ఉజ్వల శకం. అప్పటి అస్తిత్వం రూపుదిద్దుకుని అనేక త్యాగాల, ప్రాణత్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. అలాంటి ఉద్యమాలు మరెన్నో! ఆ స్ఫూర్తి, అప్పటి అస్తిత్వానికి ఉపకరించిన పరిస్థితులు ఈనాడు లేవు.

అస్తిత్వ స్పృహను పెంచి పెద్ద చేయడంలో తోడ్పడే అంశాలయిన చరిత్ర, సంస్కృతులపెంపుదల, మాతృభాషాభివృద్ధి, సామాన్య, ఉన్నత విద్య, అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరం. పరిశోధకులకు కామధేనువు లాంటి వేటపాలెం 'సరస్వతీ నిలయం' గ్రంథాలయం, రాజమహేంద్రవరంలోని గౌతమీ గ్రంథాలయం, నెల్లూరు వర్ధమాన సమాజ గ్రంథాలయం ఇవ్వాళ కళాకాంతులు లేక వెలవెలపోతున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో, మరెన్నో కారణాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సరే, విద్యావంతులు, మేధావులు, సృజనశీలురు ఆలోచిస్తారా? కార్యాచరణకు పూనుకుంటారా? ❑




# చారిత్రక వనరులపై నిర్లిప్తత ఎందుకు?

**కొప్పర్తి వ్యాసానికి స్పందన**

**సంగిశెట్టి శ్రీనివాస్**

కొప్పర్తి వెంకటరమణ ఆంధ్రజ్యోతిలో జూలై 2న “తెలంగాణ లేని ‘ఆంధ్ర’కు అస్తిత్వ స్పృహ ఉందా” అనే వ్యాసాన్ని, దానికి స్పందనగా ఆచార్య వకుళాభరణం రామకృష్ణ జూలై 10న ‘అస్తిత్వ చరిత్ర – అస్తిత్వ స్పృహ’ పేరిట మరో వ్యాసాన్ని రాసిండ్రు. తిరిగి తిరిగి మళ్లొక్కసారి ‘అస్తిత్వం’, ‘చారిత్రక స్పృహ’ను ఈ వ్యాసాలు చర్చలోకి తీసుకొచ్చాయి. ఈ రెండు వ్యాసాలూ ప్రధానంగా ‘ఆంధ్రా’ చుట్టు తిరిగాయి. అయితే ఈ సందర్భంగా ‘ఆంధ్రా’ వారు కూడా పట్టించుకోవాల్సిన కొన్ని అంశాలను తెలంగాణ కోణంలో జోడించడానికి నా ఈ వ్యాసం ప్రయత్నిస్తుంది.

‘తెలంగాణ నుంచి విడివడిన ఆంధ్రదేశం తనదైన చరిత్ర నిర్మాణానికి ఇంతవరకూ పూనుకోలేదు’ అని కొప్పర్తి అభిప్రాయపడ్డారు. అలాగే ‘కొత్తగా జరగవలసిన పరిశోధనలో ఆంధ్రదేశానికి చెందిన నిర్దిష్టత ఏదో వెలికి రావలసి ఉంది’ అని కూడా ఆయన పేర్కొన్నారు. అవును, నిర్దిష్టంగా విషయాలు వెలుగులోకి రావాలంటే ముందుగా ‘సమాచార వనరులు’ అందరికీ అందుబాటులో ఉండాలి. అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి, వివక్షత, విస్మరణ లేని తనదైన చరిత్ర నిర్మాణానికి పూనుకోవాలి. అయితే ఆంధ్రప్రదేశ్–, తెలంగాణ రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ‘చారిత్రక వనరులు, పంపకాల’పై రెండు రాష్ట్రాలు ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవడంలో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నాయి. తాత్సారం చేస్తున్నాయి. ఈ నిర్లిప్తత, తాత్సారం భవిష్యత్ తరాల వారికి అసలు సమాచారమే అందుబాటులో లేకుండా చేసే ప్రమాదమున్నది. ఆ ప్రమాద ఛాయలు ఇప్పుడు కనిపిస్తున్నాయి.



ఆచార్య రామకృష్ణ తమ వ్యాసంలో ‘తెలుగువారి చరిత్ర రచన, ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతానికి చెందినది, 20వ శతాబ్ది ఆరంభంలోనే మొదలైంది. కొమర్రాజు లక్ష్మణరావు నేతృత్వంలో విజ్ఞాన చంద్రికాగ్రంథమండలి, ఈ బృహత్కార్యాన్ని తలకెత్తుకుంది’ అని రాసిండ్రు. ఈ విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి 1906లో హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభమయిందని గుర్తుంచుకోవాలి. అట్లాగే ‘హైదరాబాద్ స్టేట్’ ఏర్పాటైన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఒక చరిత్ర రచనా కమిటీని ఏర్పాటు చేసిండు. గోపాలరావు ఎగ్బోటే నేతృత్వంలోని ఈ కమిటీ నాలుగు సంపుటాల్లో ‘హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర’ను రికార్డు చేసింది. దీనికి కొనసాగింపుగా తెలంగాణ ప్రభుత్వం చరిత్రను కొత్తగా అంది వచ్చిన ఆకారాలతో, స్థానీయ కోణంలో రికార్డు చేయించడానికి ఒక అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేసి, మరుగున పడ్డ ఘనచరిత్రను వెలుగులోకి తేవాలి. ఇందుకు చిత్తశుద్ధి అవసరం.

ఉమ్మడి రాష్ట్రంలో ‘ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ’కి ప్రత్యేకమైన వెబ్‌సైట్ ఉండేది. ఇందులో 1952 నుంచి ఆంధ్రప్రదేశ్ (కొన్ని హైదరాబాద్ అసెంబ్లీ) శాసనసభ డిబేట్స్ అన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండేవి. వీటి ఆధారం గానే 1969 ఉద్యమ సందర్భంలో కొండా లక్ష్మణ్ బాపూజీ, ఈశ్వరీబాయి లాంటి వారు అసెంబ్లీలో వినిపించిన ధిక్కారస్వరం చరిత్రలో రికార్డయింది. ఆనాటి పాలకుల వైఖరిని కూడా ఈ చర్చలు రికార్డు చేశాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్త వెబ్‌సైట్ నిర్మితమయింది. ఈ వెబ్‌సైట్‌లోనూ, అటు ఆంధ్రప్రదేశ్ వెబ్‌సైట్‌లోనూ ఈ డిబేట్స్, గత మంత్రివర్గ వివరాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి జీవిత వివరాలు, తీర్మానాలు ఏవీ కూడా అందుబాటులో లేవు. ఉమ్మడి చరిత్రను ఇరు రాష్ట్రాలు పంచుకోవాల్సి ఉండగా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇంకా చెప్పాలంటే ఉభయరాష్ట్రాలూ రద్దు చేశాయి.

రెండోది పొత్తూరి వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రామకృష్ణ పేర్కొన్న రాజమండ్రి గౌతమీ లైబ్రరీ, వేటపాలెం 'సరస్వతీ నిలయం' (సారస్వత నికేతనం), నెల్లూరు 'వర్ధమాన సమాజం' గ్రంథాలయాలతో పాటు ఇతర (కాకినాడ) గ్రంథాలయాల నుంచి పాత పత్రికలు, వార్షిక సంచికలు, కొన్ని అరుదైన పుస్తకాలను డిజిటలైజ్ చేయించి 'ప్రెస్ అకాడెమీ ఆర్కయివ్స్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి అందరికీ అందుబాటులో ఉంచారు. రెండు రాష్ట్రాల్లోని స్కాలర్స్‌కే గాకుండా, దేశ, విదేశాల్లోని పరిశోధకులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ ఇప్పుడు 'తెలంగాణ మీడియా అకాడెమీ'గా మారింది. బహుశా 'మెయింటెనెన్స్' సమస్యల వల్ల ఆ వెబ్‌సైట్ ప్రస్తుతం పనిచేయడం లేదు. నిజానికి ఇందులో తెలంగాణకు చెందిన 'తెనుగు', 'నీలగిరి', 'సుజాత' ఇంకా విలువైన పాత పత్రికలు, తెలంగాణ ఉద్యమ పత్రికలను జోడించి దీన్ని మెరుగుపరిచి, ఇండెక్స్ తయారుచేసి అందుబాటులోకి తేవాల్సిన అవసరమున్నది. 'ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ ఆర్కయివ్స్' మెయింటెనెన్స్ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా తీసుకొని చేయవచ్చు. కానీ ఆ పని వాళ్ళూ చేయడం లేదు.

మరో విషయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి, విశాఖపట్నం, నిజామాబాద్‌లతో పాటు హైదరాబాద్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీల్లో ఉన్న పుస్తకాల వివరాలు, అవి ఇష్యూలో ఉన్నాయా? అందుబాటులో ఉన్నాయా? ఏ రచయిత పుస్తకం ఏ గ్రంథాలయంలో దొరుకుతుంది అనే సమాచారం 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ లైబ్రరీ' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండేది. దీని ద్వారా ఏ రచయిత పుస్తకాలు ఏవి అచ్చయినాయి? అనే సమాచారంతో బాటు అవి ఎక్కడ దొరుకుతాయి అనే వివరాలు కూడా 'వెబ్‌సైట్' ద్వారా అందరికీ తెలిసేది. తద్వారా పరిశోధకులు తమకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుపడేది. అయితే దురదృష్టవశాత్తు ఈ 'సైట్' ఆగిపోయింది. అలాగే అఘోరనాథ్ చటోపాధ్యాయ 'చాందా రైల్వే ఉద్యమం' మొదలు 'కొమురం భీమ్' పోరాటాల వరకు హైదరాబాద్‌కు సంబంధించిన ఎంతో విలువైన హోం మినిస్ట్రీ ఫైల్స్, పుస్తకాలు ఉన్న 'సచివాలయ గ్రంథాలయం' ఇప్పుడు ఎవరికీ అందుబాటులో లేకుండా చీకటి గదుల్లో స్టోర్ చేసింద్రు. ఇట్లా గాలి, వెలుతురు సోకని ప్రదేశంలో ఈ పుస్తకాలున్నట్లయితే 'జాతి సంపద' భవిష్యత్‌లో లుప్తమయ్యే ప్రమాదముంది.

అట్లాగే తెలుగు యూనిర్సిటీలో ఉన్న అరుదైన కైఫియత్తులు, స్టేట్ ఆర్కైయివ్స్‌లో ఉన్న చారిత్రక పత్రాలు, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీల్లో ఉన్న తాళపత్రాలు, అరుదైన పుస్తకాలకు సంబంధించిన సమాచారాన్ని 'వెబ్‌సైట్ల' ద్వారా అందుబాటులోకి తీసుకు రావొచ్చు. ఆంధ్ర, రాయలసీమకు సంబంధించిన కైఫియత్తులు అచ్చయ్యాయి. కానీ తెలంగాణ కైఫియత్తులు ముద్రణకు నోచుకోలేదు. మెకంజీ సేకరించిన కైఫియత్తుల్లో తెలంగాణవి కూడా ఉన్నాయనే సోయే లేదు. దీనికి తోడు తిరుపతి ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో ఉన్న పాత తాళపత్ర గ్రంథాలు, అరుదైన పుస్తకాలను కూడా 'సైట్ల'లో చేర్చవచ్చు. టిటిడి నుంచి రెగ్యులర్‌గా ఈ లైబ్రరీకి అందే ఫండ్ ఎందుకు ఆగిపోయిందో కూడా విచారణ జరిపించాలి. ఇట్లా చేసినట్లయితే రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి- ప్రాంత అస్తిత్వ సమాచారం అందరికీ అందుబాటులోకి వస్తుంది. తద్వారా ప్రపంచమంతటా పరిశోధకులకు ఈ కరోనా విపత్సమయంలో తోడ్పాటును అందించిన వారమవుతాము. అలాగే తెలంగాణ, ఆంధ్రా అధికారులు లండన్, మద్రాసుల్లో ఉండిపోయిన తెలుగు వారి పురావస్తు, తాళపత్ర ఆస్తిని డిజిటలైజేషన్ ద్వారా అందరికీ అందుబాటులోకి తేవాల్సిన అవసరమున్నది. అలా కానప్పుడు కనీసం నెల్లూరులో ఉన్న కేంద్రప్రభుత్వ 'క్లాసికల్ తెలుగు అధ్యయన కేంద్రం' ద్వారానైనా ఈ పని చేయించవచ్చు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏడేళ్లు దాటుతున్నా ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా, చారిత్రక, సాంస్కృతిక రంగాల్లో జరగాల్సిన కృషి సంతృప్తికరంగా జరగడం లేదు. సాంస్కృతిక చారిత్రక వారసత్వాన్ని గర్వంగా చాటాల్సిన ప్రస్తుత తరుణంలో ఆ దిశలో అడుగులు పడడం లేదు. 1969 ఉద్యమానికి 2019లో 50 ఏండ్లు నిండాయి. ఆ సందర్భంగా ప్రభుత్వం తరపున కనీసం ఉద్యమకారులను ఎక్కడా తలచుకోలేదు. 1969 ఉద్యమానికి సంబంధించి కొన్ని వేల పేజీల సమాచారం పుస్తకాలుగా వెలువడాల్సిన అవసరమున్నది. ఆ దిశలో 'తెలంగాణ హిస్టరీ సొసైటీ' తరపున కొంతమంది మిత్రులం కలిసి రెండు బృహత్ పుస్తకాలను వెలువరించాము. ఆ పని కొనసాగాల్సిన అవసరమున్నది. అంతేగాకుండా 'తెలంగాణ' పేరును విశ్వవ్యాప్తంగా పరిచయం చేసిన 'సాయుధ రైతాంగ పోరాటా'నికి

☞ మిగతా **22వ** పేజీలో



# కళకళలాడుతున్న గౌతమీ గ్రంథాలయం

డా॥ అరిపిరాల నారాయణరావు
విశ్రాంత ఉపన్యాసకుడు

ఈ నెల 10వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో వకుళాభరణం రామకృష్ణ వ్యాసం చదివాను. చివరి పేరాలో "పరిశోధకులకు కామధేనువు లాంటి వేటపాలెం సరస్వతీ నిలయం గ్రంథాలయం, రాజమహేంద్రవరంలోని గౌతమీ గ్రంథాలయం, నెల్లూరు వర్ధమాన సమాజ గ్రంథాలయం ఇవాళ కళాకాంతులు లేక వెలవెలపోతున్నాయి" అని రాశారు. ఎప్పటి విషయమో గుర్తు పెట్టుకుని గౌతమీ గ్రంథాలయం గురించి రామకృష్ణ రాసి ఉంటారనుకుంటున్నాను.

2017 సంవత్సరం నుంచి గౌతమీ గ్రంథాలయం రూపురేఖలు మారాయి. శిథిలావస్థలో ఉన్న బాబాయమ్మ మెమోరియల్ హాల్ స్థానంలో అధునాతన సౌకర్యాలతో గ్రంథాలయం తీర్చిదిద్దబడింది. ఈ వ్యాసకర్త సూచనలతో నాటి స్థానిక శాసనసభ్యులు డా. ఆకుల సత్యనారాయణ చొరవ వల్ల రూ. 3 కోట్ల వ్యయంతో (75 లక్షల ఎంపీ నిధులు, రెండు కోట్ల సిఎం నిధులు, 30 లక్షలు కార్పొరేషన్ నిధులు) నూతన భవనం సమకూరింది. నిధులు సమకూర్చడంలో డా. ఆకుల వారి కృషి కొనియాడదగింది. కేవలం భవనం సమకూరడమే కాదు, నిత్యం 250, 300 మంది విద్యార్థులతో పరిశోధకులతో గ్రంథాలయం కళకళలాడుతోంది.

ప్రాచీన గ్రంథాలకు, పత్రికలకు శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం నిలయం. వాటిని డిజిటలైజేషన్ ద్వారా భద్రపరచాలని డా. ఆకుల సత్యనారాయణను కోరగా, సొంత నిధులతో పరికరాలు, జీతాలు సమకూర్చారు. ఇప్పటికి సుమారు 20 వేల గ్రంథాలు, పత్రికలను డిజిటలైజ్ చేశాం. కరోనా ఉపద్రవం తగ్గిన తరువాత మిగిలిన పుస్తకాలను కూడ డిజిటలైజ్ చేస్తాం. దానికి కూడా డా. సత్యనారాయణ నిధులు సమకూరుస్తానని మాటిచ్చారు. బెంగళూరు 'మనసు ఫౌండేషన్' ప్రతి అంశంలోనూ డా. ఎం.వి.రాయుడు, వారి మిత్రబృందం సహకారాన్ని అందజేస్తున్నారు. వెబ్‌సైట్‌కు అనుగుణంగా కేటలాగ్ తయారవుతున్నది.

పోటీ పరీక్షలకు చదివే విద్యార్థుల సంఖ్య పెరగడంతో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (గుడా) నుంచి మాజీ ఎపిపిఐసి చైర్మన్ శీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం, మాజీ కార్పొరేటర్ ప్రసాదుల హరనాథ్ కృషి వల్ల 72 లక్షల నిధులతో ఒక అంతస్తు నిర్మాణమవుతున్నది. గ్రంథాలయ సుందరీకరణకు, బాలల గ్రంథాలయం ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. అది కూడ త్వరలో ప్రారంభం కానుంది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డును శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయానికి ప్రకటించింది. 10 లక్షల రూపాయలు, జ్ఞాపిక, సర్టిఫికెట్ వచ్చే నెలలో అందజేయబోతున్నట్లు ప్రకటించింది. గ్రంథాలయ అభివృద్ధి విషయంలో లైబ్రేరియన్ ఆర్.సి.హెచ్. వేంకట రావు, సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారు. ❑

## చారిత్రక వనరులపై నిర్లిప్తత ఎందుకు ?

**(21వ పేజీ తరువాయి)**

ఇది వజ్రోత్సవ సంవత్సరం. ఈ ప్రజాపోరుకు సంబంధించిన వివిధ అంశాలను ప్రభుత్వపరంగా రికార్డు చేయాల్సిన అవసరమున్నది.

తెలంగాణ అమరుల చిహ్నంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద నిర్మిస్తున్న 'అమరవీరుల స్మృతి కేంద్రం'లో ప్రదర్శనకు పెట్టడానికి తొలిదశ, మలిదశ ఉద్యమంలో బలిదానాలు చేసిన ఉద్యమవీరుల ఫోటోలను, పోరాట చిత్రాలను సేకరించి పదిలపరచాల్సిన అవసరమూ ఉన్నది. అంతేగాదు ప్రపంచం అబ్బురపడేలా మన ఉద్యమ ఘనతను చాటాలి. ఇవన్నీ చారిత్రక ఆధారాల సేకరణ, అస్తిత్వ స్పృహ ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఆ దిశలో ప్రభుత్వం, అధికారులు, నాయకులు, బుద్ధిజీవులు, చరిత్రకారులు చర్యలు తీసుకోవాల్సిన సందర్భమిది. ❑

కొప్పర్తి వ్యాసానికి స్పందన

# ఆలోచింపచేసే వ్యాసం



పి.పి.శాస్త్రి

జూన్ 2021 "జాతీయ స్ఫూర్తి" పత్రికలో వేసిన కొప్పర్తి వెంకట రమణ మూర్తి గారి వ్యాసం "ఆంధ్రప్రదేశ్ కు అస్తిత్వ సృహ ఉందా" ఆలోచింప చేసేదిగా వుంది.

(ఒక సూచన. 'అస్తిత్వం' అనే మాటకి బదులుగా 'ఉనికి' (existence) అని చదుకుంటే ఇంకా సౌకర్యంగానూ, సరళంగాను అనిపించింది నాకు.)

ఆంధ్రప్రదేశ్ ఉనికిని కాపాడుకోవాలని వ్యాసకర్త కోరిక మరియు తపన. రాష్ట్ర ఉనికి నిలబెట్టుకోవడము అవసరం. అందుకు వేరే అభిప్రాయం ఉండనవసరం లేదు. దానికి రాష్ట్ర పేరును 'తెలుగునాడు' లేదా ఇంకో పేరైనా పెట్టాలని సూచిస్తున్నారు మాష్టారు. అయితే దానికి ఆయన చెప్పిన 'అంత్యము నందు అచ్చు వుండడం' కాకుండా 'ప్రదేశ్' అని హల్లు వుండడం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. ఇది కొంత ఏదో సెంటిమెంటు లేదా మూఢ విశ్వాసం లాగా వుంది.

తమిళ మాట్లాడేవారు తమిళనాడు, తెలంగు మాట్లాడేవారు తెలంగాణా అని పిలుచుకుంటున్నట్టు, తెలుగు మాట్లాడేవారు తెలుగునాడు అనడం బాగానే వుంది. కాని తెలుగుదేశం పార్టీ పేరుకి దగ్గరగా వుండడంతో తెలుగునాడు అనడానికి తెలుగు అంటేనే పడని ఇప్పటి వైఎస్ఆర్ పార్టీ అంగీకరించదు.

ఈ పేరు మార్పు ప్రతిపాదనలు మొదలెడితే కష్టం. ఇప్పటి పరిస్థితులలో వైఎస్ఆర్ పేరు వచ్చేట్టుగా ప్రయత్నాలు మొదలెడతారు.

అందుకని ఆంధ్రప్రదేశ్ అని వుండడం ఉత్తమం. ఆంధ్రప్రదేశ్ పేరుకి ఎప్పటి నుండో వున్న చారిత్రక ప్రత్యేకతలను ఆ రాష్ట్ర ఉనికిని నిలబడేటట్టుగా ఉపయోగించుకోవాలి.

ఆంధ్రదేశ ఉనికిలో అంతర్భాగంగా వున్న రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర అనే మూడు ఉనికిల మూలం లోంచి వచ్చిన ఆలోచనే మూడు రాజధానుల ప్రస్తావన, ఇది సాహసోపేతమైన నిర్ణయం, పరిపాలన దౌత్యం అని వ్యాసకర్త అభిప్రాయంతో ఏకీభవించలేక పోతున్నాను. అలా చెప్పడం సరియైనదిగా అనిపించలేదు.

మూడు ప్రాంతాల అభివృద్ధి మూడు రాజధానులతో సాధ్యం కాదని ఈ రెండేళ్ళ పాలనతో దాదాపు నిరూపణ ఐపోయింది. నిజానికి ఆ రకమైన మూడు ప్రాంతాల అభివృద్ధి ఆలోచనే ఈ రెండేళ్ళలో జరగలేదు. మూడు ప్రాంతాల ఉనికికీ, మూడు రాజధానులకూ సంబంధం లేదు. మూడు రాజధానుల ప్రస్తావన కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే.

ఆంధ్రదేశ ఉనికి కాపాడుకోలేకపోవడానికి, కొత్త అస్తిత్వ స్పృహ పెరగకపోవడానికి కారణం, ఇంకా ఆంధ్రదేశ ప్రజలు తాము విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా అయ్యామనే స్పృహ లేకపోవడమే.

ఇప్పటికీ అన్ని విషయాలకీ హైదరాబాదు వైపు చూడడం.

ఇంకా ఇప్పటికీ చాలా మంది తమ పెట్టుబడులు, వ్యాపారాలు హైదరాబాదు కేంద్రంగానే కొనసాగించడం.

ఇంకా ఇప్పటికీ వైద్యం, విద్య, వ్యాపారాలకు హైదరాబాదు వైపే చూడాల్సి రావడం,

ఇంకా ఇప్పటికీ వార్తాపత్రికలు, టీవీ ఛానళ్ళు హైదరాబాదు కేంద్రంగానే పనిచేయడం, ఇంకా ఇప్పటికీ సినిమాలు, సినీ స్టూడియోలు హైదరాబాదు కేంద్రంగానే వుండడం, ఇంకా ఇప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రులూ, ప్రతిపక్ష నాయకులూ, అందరు నాయకులూ హైదరాబాదుతోనే వ్యక్తిగత, వ్యాపార సంబంధాలు కలిగి వుండడం, అవీ ఇవీ అన్నీ ఆంధ్రప్రదేశ్ అస్తిత్వం నిలబెట్టుకోడానికి అడ్డంకులే.


ఈ అడ్డంకులు తొలగించుకున్నప్పుడే ఆంధ్రప్రదేశ్ తన ఉనికిని పొందగలుగుతుంది. ఇది విమర్శ కాదు. నాకు కలిగిన ఆలోచనలు మాత్రమే. ❑

(వాట్సాప్‌లో వచ్చిన స్పందన)

# లాల్-నీల్ మైత్రి - నేటి చారిత్రక అవసరం

## మంగళగిరి, తణుకులో పుస్తక ఆవిష్కరణలు

బిజెపి, ఆర్ఎస్ఎస్ మనువాద ఫాసిస్టు శక్తులు సాగిస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం కమ్యూనిస్టు పార్టీల వల్లనే సాధ్యం కాదని, వామపక్ష ప్రగతిశీల, లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అవసరమని, కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాలని, తద్వారా రాజ్యాధికారం సాధించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. 'లాల్ నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరం'పై రేఖా కృష్ణార్జునరావు రూపొందించిన వ్యాస సంకలన పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవనంలో జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న రామకృష్ణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ జీవించిన రోజుల్లోనే ఆయన కమ్యూనిస్టు పార్టీని వ్యతిరేకించారని, ఆనాడు దేశంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు మాత్రమే ఉండేవారని, 1952 ఎన్నికల్లో దేశవ్యాపితంగా ముఖ్యంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కమ్యూనిస్టులు అత్యధిక స్థానాల్లో గెలుపొందారని, తర్వాత కాలంలో కమ్యూనిస్టుల చీలికలు సంభవించాయని, ఆనాటి నుంచి 1980 వరకు ప్రధాన శత్రువును పక్కన పెట్టి ఒకరినొకరు విమర్శలు చేసుకోవడం సరిపోయిందన్నారు. దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లుతోందని, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, నిర్బంధాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. లాల్ నీల్ ఐక్యత కోసం అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్, యువకులు కన్హయకుమార్ వంటి వాళ్లు ముందుకు వచ్చారని గుర్తు చేశారు.




సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి మాట్లాడుతూ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష పార్టీలు అత్యధిక స్థానాల్లో గెలుపొందా యన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జేవీ రాఘవులు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని చెప్పారు. దళిత బహుజన ఫ్రంట్ కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాలను గుర్తు చేశారు. పుస్తక రచయిత కృష్ణార్జునరావు మాట్లాడుతూ లాల్ నీల్ మైత్రిపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ లాల్ నీల్ అనేది కేవలం పుస్తకం వరకు మాత్రమే పరిమితం కాకుండా రెండు రాష్ట్రాల్లో విస్తృతచర్చ జరగాలని, ఐక్యత తప్పనిసరని, కార్ల్‌మార్క్స్ యావత్తు ప్రపంచానికి దిక్సూచి అయితే అంబేద్కర్ సిద్ధాంతం మన దేశానికి ఆదర్శమన్నారు. ఏఎన్‌యు పూర్వ ఆచార్యులు అబ్దుల్ నూర్ బాషా, ఎంఎల్ రెడ్‌స్టార్ పార్టీ నాయకులు మన్నవ హరిప్రసాద్, జమైతే ఇస్లాం హింద్‌నాయకులు ఎస్‌కే అజీమ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు ప్రసంగించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు అభ్యుదయ గీతాలు ఆలపించారు. సిపిఐ మంగళగిరి పట్టణ కార్యదర్శి కంచర్ల కాశయ్య, కార్మిక నాయకులు అన్నవరపు ప్రభాకర్, అరసం నాయకులు మోతుకూరి అరుణకుమార్ పాల్గొన్నారు. ❑



మంగళగిరిలో పుస్తకావిష్కరణ చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి **కె. రామకృష్ణ**



మంగళగిరి, తణుకులో పుస్తక ఆవిష్కరణలు

# దోపిడీ, వివక్షలపై పోరాటానికి లాల్ –నీల్ ఐక్యత

దోపిడీ, కులవివక్ష, లింగ వివక్ష, మత వివక్ష లేని సమసమాజాన్ని సాధించడానికి లాల్–నీల్ ఐక్యత తప్పనిసరి అవసరం అని జాతీయ స్ఫూర్తి సంపాదకులు డి వి వి ఎస్ వర్మ అభిప్రాయపడ్డారు. స్థానిక సురాజ్య భవనంలో జరిగిన "లాల్,నీల్ మైత్రి– నేటి చారిత్రక అవసరం" పుస్తక ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించి ఆయన ప్రసంగించారు

బిజెపి పాలనలో మతజాతీయవాదం, మను సామాజిక వాదం, కార్పొరేట్ ఆర్థికవాదం అన్న మూడు సవాళ్ళను ఎదుర్కొంటున్నామని ఇందులో మొదటి రెండూ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య విలువలకీ విరుద్ధమైనవని ఆయన అన్నారు. అంబేద్కర్ సారథ్యంలో పౌరుల సమానత్వం, పౌరహక్కుల ప్రాతిపదికగా రూపుదిద్దుకున్న రాజ్యాంగం మత జాతీయ వాదాన్నీ, మనుధర్మవాదాన్నీ పూర్తిగా తిరస్కరించిందనీ పేర్కొంటూ బిజెపి, దాని మాతృసంస్థ ఆర్.ఎస్.ఎస్. లు తమ హిందూ రాష్ట్ర లక్ష్య సాధన కోసం వాటిని పునరుద్ధరించడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించక పోతే తిరిగి నిచ్చెన మెట్ల కులవ్యవస్థ, మైనారిటీలపై వివక్ష, మహిళలపై వివక్ష చట్టబద్ధమౌతాయని ఆయన అన్నారు.



తణుకులో పుస్తకావిష్కరణ చేసిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ **ఆకుల వెంకటేశ్వరరావు**

కార్పొరేట్ ఆర్థికవాదం తెచ్చే అనర్థాల గురించి కార్ల్ మార్క్స్ చేసిన విశ్లేషణ ఎంత సరైనదో 7 ఏళ్ల బిజెపి పాలన రుజువు చేసిందనీ 10 శాతం మంది దగ్గర 80 శాతం సంపద పోగుపడ్డ తీరు రుజువు చేస్తున్నదనీ, ఇది చాలదన్నట్టు ప్రభుత్వరంగ సంస్థల్ని, ఆస్తులను, ప్రకృతి వనరులను వారికే దోచిపెట్టడాన్ని ప్రతిఘటించడం, పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా ప్రజలందరికీ మౌలిక ఆదాయాన్ని, మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు ఉచితంగా అందించే ఏర్పాటు కోసం, వివక్ష లేని గౌరవంగా స్వతంత్ర జీవనానికి ఏర్పాట్లు సాధించుకోవాలని దానికి లాల్–నీల్ నినాదంతో మార్క్స్ –అంబేద్కర్ల భావజాల సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతకు ముందు ఈ పుస్తకావిష్కరణ సభను నిర్వహిస్తున్న తణుకు స్టడీ సర్కిల్ కన్వీనర్ డా. రమేష్ చంద్రబాబు స్వాగతం చెప్పారు.

మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రముఖ నేత్రవైద్యులు డా హుస్సేన్ అహ్మద్‌కు అందించారు.

కాలజ్ఞానం సంపాదకులు పి మురళీ కుమార్ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఈ పుస్తకంలో రచయితలు లాల్, నీల్ మైత్రికి దోహదం చేసే పలు కోణాలను మన ముందుంచారని, అలాంటి మైత్రికి అవసరమైన భావజాల పునాదిని ఈ పుస్తకం అందించిందని అన్నారు.

సిపిఐ నాయకులు కోనాల భీమారావు మాట్లాడుతూ కుల వర్గ సమాజాన్ని అర్థం చేసుకుని మార్క్స్, అంబేద్కర్ల భావజాల సమన్వయంతో ఐక్య ఉద్యమాల నిర్మాణానికి ఇది దారి చూపుతుందని అన్నారు.

బహుజనుల రాజ్యాధికారానికి ఈ మైత్రి అవసరమని బి.ఎస్.పి. నాయకులు పొట్ల సురేష్ అన్నారు. సిపియం మహిళా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి ఈ మైత్రిని స్వాగతించారు. చీలిపోయిన వామపక్షాలు, దళిత, బహుజనసంఘాలు ఇప్పటికైనా ఐక్యంగా కలిసి పోరాడాలని సమతా ఎడ్యుకేషనల్ సొసైటీ నీలం మాల్యాద్రి, సామాజిక న్యాయ పోరాటసమితి నాయకులు జి.అంబేద్కర్‌లు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కె ఎస్ ఎం కుమార్, జి సోమశేఖర్, బీఎస్పీ మధు, విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, సికిలే పుష్పకుమారి సిపిఐ, ఐద్వా నాగరత్నం, ఎ.ఐ.ఎస్.ఎఫ్. అప్పలస్వామి తదితరులు మాట్లాడారు. ❑

# మహత్తర విప్లవానికి బాటలు

డి. హనుమంతరావు

సమాజాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్ళాలంటే ఏం చేయాలి? ప్రగతిఫలాలు అందరికీ సమానంగా అందాలంటే ఏం చేయాలి? వంటి ఆలోచనల్ని అభ్యుదయవాదులు ఎప్పుడూ చేస్తూనే ఉంటారు. ప్రపంచంలోని ప్రతిదీ మారుతుంది అన్న సూత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ ఆలోచనలు కూడా మారాల్సిన అవసరాన్ని గుర్తించగలం. భౌతికశాస్త్రాల్లో అంటే ప్యూర్ సైన్సెస్‌లో ఒక సూత్రం తయారైతే అది సార్వత్రిక మవుతుంది. కానీ సామాజిక శాస్త్రాల్లో ఇలాంటి సార్వత్రిక సూత్రాలు ఉండవు. నిర్దిష్ట పరిస్థితులకు లోబడి అంటే దేశ, కాలమాన పరిస్థితులకు లోబడి మాత్రమే సూత్రీకరణలు చేయగలం. ఏ భావజాలమైనా, ఏ సామాజిక సిద్ధాంతమైనా ఇందుకు లోబడక తప్పదు.

చాలావరకు వివిధ అభ్యుదయ, విప్లవ సంస్థలలో కానీ, మత సంస్థల్లో కానీ చివరగా 'అన్యవర్గ భావజాలాన్ని విడనాడదాం' అంటూ ముగిస్తారు. ఇది ఎంత మంచిదో అంత చెడ్డది. గతంలో కమ్యూనిస్టు పార్టీల పంథా ఇలా ఉండేది – "పునాది ఉపరితలం: ఆర్థిక సంబంధాలు పునాది వంటివి. సాంస్కృతిక సంబంధాలు ఉపరితలం వంటివి. కావున పునాదిని మార్చాలి. అంటే వర్గ పోరాటం ద్వారా సోషలిజాన్ని స్థాపించాలి." కానీ ఆ పునాదికున్న భావపునాదులు కూడా అంతే ముఖ్యం అన్నది మనం గుర్తించాలి.

**లాల్, నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరం పుస్తకంపై అభిప్రాయ వేదిక**

ఒక్క సంఘటన చెబుతాను, ఎంగెల్స్ ఓసారి కార్ల్ మార్క్స్‌కు ఒక ప్రతిపాదన చేసాడు. అమెరికాలో వ్యవసాయం చేసే రైతులను కూడగట్టి రైతులద్వారా విప్లవం సాధించే ప్రణాళిక అది. మార్క్స్ దాన్ని నిర్ద్వందంగా తోసిపుచ్చుతూ కార్మికవర్గమే చైతన్యవంతమైన దని, రైతులు గోనెసంచుల్లో నింపిన బంగాళదుంపల వంటి వారని, కనుక సాధ్యం కాదంటాడు, మరి చైనాలో మావో రైతాంగాన్ని సంఘటిత పరిచి విప్లవాన్ని సాకారం చేశాడు కదా! అందుకే దేశ, కాల, మాన పరిస్థితులు అనేది.

గత కమ్యూనిస్టుల దృష్టిలో ఆర్యసమాజ్, బ్రహ్మసమాజ్, ఇతర సామాజిక సంస్కరణోద్యమాలన్నీ పైపైన చేసే ఉత్తుత్తి పోరాటాలు. నాస్తిక హేతువాదులు నీడ పైన చేసే యుద్ధాలు. ఇతరుల దృష్టిలో కమ్యూనిస్టులు అంతర్జాతీయ దృక్పథం తప్ప, స్థానిక దృక్కోణం లేనివారు. కానీ ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూస్తే ఆర్యసమాజ్, బ్రహ్మసమాజ్ వంటి సంస్థల ద్వారానే స్వాతంత్రోద్యమానికి పెద్ద ఎత్తున విప్లవకారులు అందారు. సామాజికోద్యమాల చైతన్యం వలనే కమ్యూనిస్టు సంస్థలకు పెద్ద ఎత్తున కేడర్ సమకూరింది. కమ్యూనిస్టు సంస్థల వల్లనే ఎన్నో సంస్కరణలు ఆచరణ రూపం ధరించాయి. ఇవి సైద్ధాంతికంగా పరస్పర విరుద్ధంగా కనిపించినా ఆచరణలో పరస్పర పూరకాలుగా నిలిచాయి.

ఒకే లక్ష్యం కోసం భిన్న పద్ధతులతో, భిన్నస్థాయిల్లో జరుగుతున్న సూక్ష్మ, స్థూల పోరాటాలను సమీకృతం చేయగలిగి తేనే జాతీయ విప్లవం సాధ్యం. అన్ని సంస్థలు "అన్యవర్గ భావజాలాన్ని విడనాడదాం" అంటూ అందరికీ దూరమవుతూ ఒంటరితనాన్ని కోరి తెచ్చుకొనే ధోరణి ఆత్మహత్యా సాదృశ్యమౌతుంది.

సులభంగా అర్థం కావడానికి మన స్వాతంత్రోద్యమాన్ని చూద్దాం. అసలు మనకి స్వాతంత్ర్యం ఎలా వచ్చింది? కేవలం గాంధీజీ నాయకత్వంలోని జాతీయ కాంగ్రెసా? యువకుల విప్లవ సంస్థలా? గదర్ ఉద్యమమా? బోస్ వ్యూహమా? రైతాంగ సత్యాగ్రహాలా? అంతర్జాతీయ పరిస్థితులా? ఇంగ్లీషు భాష, పత్రికలు, రేడియోలా? సామాజికంగా అప్పుడే చైతన్యవంత మౌతున్న అణగారిన వర్గాలా... అన్నీ కలిపితేనే స్వాతంత్రోద్యమం. అన్నింటి ఉమ్మడి ఫలితమే స్వాతంత్ర్యం, అంతే తప్ప ఏ ఒక్క కారణాన్నో ప్రత్యేకంగా చూడటం దోషపూరిత అధ్యయనమే అవుతుంది.

కాబట్టి నేను చెప్పేదేమంటే లాల్-నీల్ ఐక్యత తక్షణావసరం. ఇంకా వీలైనన్ని ప్రగతి శక్తుల్ని కలుపుకోవాలి. విభజనల శకానికి

☞ మిగతా 30వ పేజీలో

# లాల్, నీల్ మైత్రి
# ప్రజాస్వామ్య రాజకీయం

**ఆర్.వెంకట్ రెడ్డి**
సామాజిక కార్యకర్త



ఈ మధ్య కాలంలో మరీ ముఖ్యంగా జేఎన్‌యూ విద్యార్థి సంఘ ఎన్నికలలో వామపక్ష, రాడికల్, ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాలు మరియు అంబేడ్కర్ ఆశయాలతో స్థాపింప బడ్డ దళిత బహుజన విద్యార్థి సంఘాలు కలిసి ABVPపై పోటీ చేసి రెండు మూడు ఎన్నికలను వరుసగా విజయం సాధించాయి. ఈ విజయాలు ఒక కొత్త రాజకీయ చర్చలకు తెర లేపాయి. ముఖ్యంగా విద్యార్థి యువజనులలో ఒక ఉత్సాహ పూరిత వాతావరణాన్ని స్ఫూర్తిని నింపాయి. విద్యార్థుల సమస్యలే కాకుండా ఆకలి నుండి, కుల వివక్షత నుండి, దోపిడి నుండి, పీడన నుండి, నిరుద్యోగం నుండి, మహిళలపై వివక్ష అత్యాచారాల నుండి విద్యలేనితనం నుండి, అనారోగ్యం నుండి ఆజాదీ" (AZAADI) కావాలని లేదా విముక్తి. స్వేచ్ఛ కావాలని నినాదాలు దేశ వ్యాప్తంగా మారుమోగాయి. ఆ సమయంలోనే HCU జరిగిన రోహిత్ వేముల వ్యవస్థీకృత హత్య సంఘటన ఆయన రాసిన నోట్ పై కూడా చర్చ అదే విధంగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఊపునందుకున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాలలో వివిధ రూపాలలో ఉద్యమాలను నిర్మిస్తున్న యువ నాయకత్వం ఈ నినాదాలకు తోడై ఎన్నికలలో పాల్గొనే దశకు కూడా చేరాయి. కొన్ని ప్రాంతాలలో గట్టి పోటీనివ్వడమే కాకుండా కుల రహిత, దోపిడి లేని సమాజ స్థాపన లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసేందుకు ఒక మంచి వేదికగా కూడా ఉపయోగించారు. గుజరాత్‌లో జిగ్నేశ్ మెవాని ఏకంగా ఎన్నికలలో శాసనసభకు ఎన్నిక కూడా అయ్యాడు.

**లాల్, నీల్ మైత్రి**
**నేటి చారిత్రక అవసరం**
**పుస్తకంపై**
**అభిప్రాయ వేదిక**

ఈ యువతరం చేసిన JNU ప్రయోగం నిరాశ నిస్పృహలో ఉన్న వామపక్ష వాదులను మరియు అంబేడ్కర్ వాదులను దేశ వ్యాప్తంగా ఒక నూతన ఉత్సాహాన్ని ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో అయితే సిపిఎం పార్టీ వివిధ బహుజన, దళిత సంఘాలతో ఆ కోవకే చెందిన రాజకీయ పార్టీలతో కలిసి ఏకంగా బహుజన్‌లెఫ్ట్ ఫ్రంట్ అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించి 2018 ఎన్నికలలో అన్నీ శాసనసభ స్థానాలకు పోటీ చేసి ఒక ప్రయోగేమ్ చేసింది.

ఈ కొత్త ఉత్సాహం దేశంలోని కొన్ని ప్రాంతాలలో దళిత సంఘాలూ. సమాజంలో ఉన్న ప్రముఖ వ్యక్తులు దళిత నాయకులు, ప్రజాస్వామిక వాదులు, వామ పక్ష భావ సారూప్యత గల వ్యక్తులు సంఘాలు కలిసి సమావేశాలు. చర్చలు చేసి నీల్ –లాల్ ఐక్య సంఘటనలుగా ఏర్పడినవి కొన్ని అయితే కొన్ని ఏర్పడడానికి సిద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో ఈ నూతన రాజకీయ ఐక్య సంఘటలపై కొన్ని సిద్ధాంతపరమైన, మరి కొన్ని ఆచరణ సంబంధమైన సందేహాలు, ప్రశ్నలు సామాజిక కార్యకర్తలలో మెదులుతున్న వాటిని పరిశీలించవలసిన అవసరం ఉంది. మొదలే కాలేదు అప్పుడే సందేహాలు, ప్రశ్నలు సిద్ధాంత చర్చలు దేనికి అనే వాదన కూడా ఉంది. పని మొదలైతే అన్నీ చర్చించవచ్చు అనే ధోరణి కూడా ఉంది. కానీ సమాజంలో ఒక సమూల మార్పు తేవడానికి ఒక సమూహం ఆలోచిస్తున్నప్పుడు ఒక సైద్ధాంతిక రూపం ఇవ్వడం ఆ సంఘాల బాధ్యత కూడా. ఎందుకంటే ఇప్పటికే దేశంలో చాలా ప్రయోగాలు జరిగాయి. ఎంతో మంది ప్రజలు పాల్గొన్నారు. ఎంతో మంది కార్యకర్తలు తమ జీవితాలను త్యాగం చేశారు. కొంత మంది ప్రాణాలు సైతం త్యాగం చేశారు. అయినా ఆ ప్రయోగాలు అశేష దళిత, బహుజన మరియు శ్రామిక ప్రజల విముక్తికి జరగవలసినంత జరుగలేదని చేయవలసినది చాలా ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఈ కొత్త సమీకరణాలు జరుగుతుండడమే ఒక నిదర్శనం.

కుల నిర్మూలన మరియు దోపిడి పీడన నుండి శ్రామికుల విముక్తి అనే అంశాలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాలలో ఆయన కార్యచరణాలలో అతి ముఖ్యమైన ఎజెండా. ఇండియన్ లేబర్ పార్టీ స్థాపననే ఒక మంచి ఉదాహరణ. బాబా సాహెబ్ ఆలోచన విధానానికి ప్రతి రూపం. ఆనాటి తొలి తరం కమ్యూనిస్టులు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారనే వాదన ఒక వైపు అయితే భారత స్థితి గతులకు అనుగుణంగా భారత కమ్యూనిస్టులు తమ వ్యూహ రచనలు ఎత్తుగడలను వేయడం విఫలం అవుతున్నారని బాబా సాహెబ్ అంబేద్కర్ గారు అభిప్రాయపడినట్లు ప్రొ.ఆనంద్ తెల్తుంబ్డే బి.ఆర్.అంబేద్కర్, భారత దేశము – కమ్యూనిజము అనే పుస్తక పరిచయంలో సవివరంగా వివరించారు. స్వతంత్ర భారతంలో

70 సంవత్సరాలకు పైబడినా దళిత బహుజనుల శ్రామికుల జీవన ప్రమాణాలలో మెరుగు పడకపోవడం విచారకరం. దళిత సంఘాలు మరియు కమ్యూనిస్టులు చేసిన ప్రయోగాలలో ఏదో ఒక లోపం వలననే ఈ దుస్థితి అని ఒప్పుకోవాలి, ఈ ప్రయోగాలలోని బలాలు బలహీనతలను బేరీజు వేసుకోవాలి. ఇప్పటి వరకు జరిగిన పొరపాట్లు జరగకుండా ఆ పొరపాట్లను మొహమాటం లేకుండా చర్చ జరిపి ప్రజల ముందు ఉంచాలి.

భారత సమాజాన్ని రాజకీయంగా సరి అయిన దృక్పథంతో అర్థం చేసుకోకుండా ఒక పరిపక్వత గల సైద్ధాంతిక దృక్పథము లేకుండా వ్యక్తుల మీద వారి విశ్వసనీయత మీద సంఘాలను స్థాపించి మరో విఫల ప్రయత్నం జరగకుండా ఒక ఆచార సాధ్య సిద్ధాంత వ్యూహాలతో మాత్రమే కుల రహిత దోపిడి రహిత సమాజాన్ని నిర్మించగలము. ఈ విశ్వాసంతోనే ఈ సందేహాలుగా భావిస్తారని అంబేద్కర్, మార్క్స్ ఆశించిన సమాజం కోసం కలలు కనే క్రమంలో ఆవిర్భవించిన సందేహాలే ఇవి అని గమనించాలి.

### కొన్ని సందేహాలు - కొన్ని సవాళ్ళు

1. ముందుగా ఈ నీల్ – లాల్ ఐక్య సంఘటలు లాల్ అంటే ఏ లాల్ అనేది స్పష్టం చేయాలి. బాబా సాహెబ్ అంబేద్కర్ ఈ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ పుట్టనప్పటి నుండి సోషలిస్ట్ భావాలతో ఉన్న కమ్యూనిస్టులతో జరిపిన చర్చలు ఇప్పటికీ అవి వర్తిస్తాయి. ఈనాడు దేశంలో కమ్యూనిస్టులు హింసా వాదం ద్వారానే రాజ్యాధికారం వస్తుంది అనే భావజాలం ఉన్న వారు ఒక వైపు ఐతే ఎన్నికలే ప్రధానం అనే నినాదంతో వివిధ సాంప్రదాయ కుల వివక్షను మరియు దోపిడిని ప్రశ్నించడమే కాదు కొన్ని సందర్భాలలో ప్రోత్సహించే ప్రధాన రాజకీయ పార్టీలతో పొత్తులు పెట్టుకునే కమ్యూనిస్టులు మరో వైపు. ఈ రెండు భావ జలాలను ప్రజలు కొన్ని సందర్భాలలో తమ విముక్తికి ఇదే మార్గం అని ఆదరించారు. ఎన్నో త్యాగాలు చేశారు. రాను రాను తిరస్కరించారు కూడా. ఇటువంటి తరుణంలో అంబేద్కర్ వాదులు ఎటువంటి భావ జాలపు వామపక్షాలతో(లాల్) ఐక్య సంఘటలకు పూనుకుంటారో దాని విధి విధానాలు ఏమిటి అనే విషయాలపై స్పష్టత రావాలి.

2. అదే విధంగా అంబేద్కర్ స్ఫూర్తితో స్థాపించిన సంఘాలు పార్టీలు కూడా ఏకతాటిపై లేవు. ఉప కులాల రిజర్వేషన్ అనుకూల వ్యతిరేక పోరాటాలు అలాగే బీసీ కులాలు (ఫూలే అంబేద్కర్ ఆశయాలతో ఏర్పడినవి) వాటి సంఘాలు వివిధ ఆలోచనల సరళిలో పని చేస్తున్నారు. వీరందరితో కలసి పని చేయడానికి వామపక్షాలకు ఎటువంటి అంశాలతో కలిసి ముందుకు వెళతారు. ఎటువంటి అంశాలపై అంగీకారం లేదో స్పష్టత ఉండాలి.

3. హిందూత్వమే కులాలకు బ్రాహ్మణ వాదానికి మూలం అని అంబేద్కర్ కుండ బద్దలు కొట్టి చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. కుల రహిత సమాజం హిందూత్వంతో ముడి పడి ఉంది. హిందూత్వ భావజాలం పీడిత కులాలలో జీవన శైలి అయిన సందర్భంలో హిందూత్వ భావజాలాన్ని ఎదుర్కొనడానికి ఎటువంటి ఎత్తుగడలను అవలంభిస్తారు. హిందుత్వపై నీల్ లాల్ వైఖరి బాబా సాహెబ్ అంబేద్కర్ అవలంభించిన హిందూ మతాన్ని వదలండి అనే వైఖరినా లేక మరేదైనా వైఖరి అవలంభిస్తారా. కుల రహిత సమాజం ఉండాలని చాలా వేదికల మీద ప్రసంగాలు మరియు చాలా సాహిత్యం కనపడుతుంది కానీ ఇంతవరకు కులాలు అంతరించాలంటే అంబేద్కర్ చెప్పిన హిందూత్వాన్ని వదలమనే వాదన తరువాత మరో ప్రత్యామ్నాయ వ్యూహం వినలేదు. హిందూ మతాన్ని సంస్కరించే దిశనా లేక హిందూ మతాన్ని వీడాలీ అనే నినాదమా దీనికి సంబంధించి ఒక చర్చ అవసరం.

4. బహుజన ఐక్యత పేరుతో మాన్యవర్ కాన్షి రామ్ గారు రాజ్యాధికారానికి అవలంభించిన ఎత్తుగడలకు నీల్ లాల్ ఐక్య రాజకీయ వేదికకు ఎత్తుగడలకు తేడా ఉంటుందా. కాన్షి రామ్ గారు రాజకీయ అధికారం కోసం వివిధ సంప్రదాయక రాజకీయ పార్టీలతో ఐక్య సంఘటన ఏర్పాటు చేసి విజయవంతం అయిన విషయము పొరపాట్లు జరిగిన విషయం చర్చలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

5. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలలో వివిధ హోదాలలో మరియు ఎన్నికలలో సర్పంచ్ నుండి ఎంఎల్ఏ, ఎంపీ ల వరకు గెలిచి పదవులలో ఉన్న దళిత బహుజన నాయకుల పట్ల నీల్ లాల్ రాజకీయ వేదిక వైఖరిపై చర్చ జరగాలి.

6. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రం లో తెలంగాణ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచిక ప్రకారం దాదాపు 12 వేల 751 గ్రామ పంచాయితీలలో 5147 ఆన్ రిజర్వ్‌డ్ పోగా 7604 గ్రామ పంచాయితీలలో ఎస్టీ, ఎస్సీ మరియు బిసి వర్గాలకు చెందిన సర్పంచులు కాగా అందులో సగం మహిళలు ఈ కులాలకు/ తెగలకు చెందిన వారు ఉన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తుతో లేదా పార్టీల పరంగా జరగక పోయిన స్థానికంగా ప్రజలలో పలుకుబడి ఉన్న దళిత బహుజన నాయకులు ఏదో ఒక పార్టీతో మద్దతు తీసుకుని పోటీ చేస్తారు. వారి పట్ల నీల్ లాల్ యొక్క రాజకీయ దృక్పదం ఎలా ఉండబోతుంది. వారిని

బలోపేతం చేసి మన రాజకీయాల వైపు ప్రేరేపిస్తామా లేదా వీరికి వ్యతిరేకంగా సమాంతరంగా నూతన నాయకత్వాన్ని బలపరుస్తామా.

7. నీల్ లాల్ సంఘటన ఎన్నికలలో పోటీ చేస్తుందా. వివిధ వేదికల మీద విన్న దాని ప్రకారం అంబేద్కర్ ఆశించిన మాస్టర్‌కి చాలా ప్రధానం అని 85 శాతంగా ఉన్న దళిత్ బహుజనులను ఏకం చేసి రాజ్యాధికారం సాధించాలని స్పష్టంగానే చెపుతున్నారు. అలాంటి సమయంలో రిజర్వేషన్ స్థానాలలో ఐక్య సంఘటన తమ అభ్యర్థులను నిలబెడుతుందా. ఆ స్థానాలలో కొన్ని సంవత్సరాల కాలంగా ఎస్సీ, ఎస్టీ నాయకులు ఎంతో కష్ట పడితే కానీ వారి వారి పార్టీలలో సీటు వచ్చి ఉంటది. దీని పై ఒక అవగాహన అవసరం.

8. మారిన కాల మాన పరిస్థితులు సమాజంలో పెట్టుబడిదారి విధానంలో మార్పులు, ఉత్పత్తి విధానంలో యంత్రీకరణ, డిజిటల్ యుగం దాని పాత్ర మరీ ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రస్తుత రాజకీయ పక్షాల పై అత్యధిక శాతం ప్రజలకు పెరుగుతున్న విశ్వాసం ప్రభుత్వాలు అందచేస్తున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలు ఈ ప్రభుత్వాలకు ప్రజలిచ్చే సమ్మతిని, పట్టణీకరణ జరుగుతున్న క్రమం గ్రామాలకు పట్టణాలకు మధ్య అంతరాలు తొలగుతున్న వైనం ప్రజలు అలవాటు పడిన కొత్తగా వచ్చిన డిజిటల్ సమాచార వ్యవస్థను కొత్త కోణంలో నుండి అర్థం చేసుకోవలసిన అవసరాన్ని గుర్తించి కార్యాచరణ రూపొందిస్తారా.

9. పేదలు మరియు దళిత బహుజన కులాల ప్రజలు సంఘటితపరచడంలో ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులను సమీకరించడంలో వామపక్ష పార్టీలు విఫలమయ్యాయి. అంబేద్కర్ ఆనాడే పసిగట్టాడు. అది ఇప్పటికీ ఏమి మారలేదననేది కరోన కాలంలో అర్థం అవుతుంది. అదే విధంగా కుల వ్యవస్థ పాత రూపంలో కాకుండా కొత్త కొత్త రూపాలలో కనపడుతుంది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు తమ అధికారానికి పూర్తిగా వినియోగిస్తున్న తీరును మౌలిక సమస్యలను మాట్లాడకుండా దాటవేస్తున్న తీరుపై నీల్ లాల్ ఐక్య సంఘటన నూతన సిద్ధాంతాన్ని దానికి అనుకూల వ్యూహాలను ఏమైనా ఏర్పరుచుకుంటుందా

10. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే కుల వ్యవస్థ నుండి బయట పడడానికి విద్య ఒక ముఖ్య ఆయుధం అని నొక్కి చెప్పినారు. దళిత సంఘాలు కానీ, అంబేద్కర్ సంఘాలు కానీ వామ పక్ష పార్టీలు కానీ తమ ఉద్యమాలలో ఒక ప్రధాన అంశంగా పెట్టక పోవడం వలననే ప్రభుత్వాలు దళిత బహుజనులకు చదువు నేర్పలేదనేది స్పష్టం అవుతుంది. అలాగే ఆరోగ్యం అందుబాటులో లేనందు వలన కూడా దళిత బహుజనులే ఎక్కువ నష్టపోయారు. నీల్ లాల్ ఐక్య సంఘటన ప్రతి దళిత బహుజన బిడ్డా కనీసం డిగ్రీ వరకు చదివి తీరాలని ఒక రాజీ లేని నిర్ణయం దానికి చేయవలసిన కార్య చరణ ఉంటుందా.

11. కొత్త సిద్ధాంతం అంటే అంబేద్కర్ వంద సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు సిద్ధాంతం భారత దేశానికి అన్వయించి పని చేయాలని ఆనాటి కమ్యూనిస్టులకు ఈ దేశంలో ఉన్న కుల సమస్యను తమ ఏజండాలో ఉండాలని ఎలా పట్టుబట్టదో అలాగే అంబేద్కర్‌వాదులు కూడా ప్రస్తుత మారిన కాల మాన పరిస్థితులను బట్టి మారిన రాజకీయ సమీకరణలు నీల్ లాల్ రాజకీయ ఎజెండాకు మద్దతుగా అన్నీ వర్గాలను కలుపుకు పోయే వ్యూహాన్ని అవలంభిస్తుందా లేక ప్రజలలో అగ్ర కులాల పట్ల వ్యతిరేక భావంతో ప్రజలను సమీకరిస్తుందా.

12. ఈ దేశంలో గాంధీ ఆయన రాజకీయ అవగాహన ఏదైనా కావచ్చు ఆయన అవలంభించిన ప్రజా సమీకరణ వ్యూహాలను తిరస్కరించలేము అంబేద్కర్, మార్క్స్ ఆలోచనకు గాంధీ స్వతంత్ర పోరాటంలో అవలంభించిన ఎత్తుగడలను ఏమైనా అనుసరించవచ్చా. వ్యూహరీత్యా నీల్ లాల్ రాజకీయ వేదిక గాంధీ సిద్ధాంతాలను నీల్ లాల్ రాజకీయ ఎజెండాకు ఉపయోగించవచ్చా. దీని వల్ల సమాజంలోని అశేష ప్రజలను సమీకరించవచ్చు. ఇది ఒక విన్నూత్న వ్యూహం అవుతుంది. ముఖ్యంగా ప్రజలలో ఉన్న లాల్ రాజకీయాలపై ఉన్న హింస రాజకీయాల పట్ల మరియు అంబేద్కర్ వాదులపై ఉన్న అందరినీ కలుపుకు పోరు అనే కొన్ని అపోహలను శాంతియుత ఉద్యమ నేపథ్యం మరియు ఓర్పు (tolerance) గా ఉంటామనే బలమైన విషయాన్ని ప్రజలలోకి తీసుకెళ్లడానికి చాలా ముఖ్యం అవుతుండ వచ్చు. ముఖ్యంగా అతివాద రాజకీయ ధోరణులకు దూరంగా ఉంటూ చాలా సామాజిక కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్న నేటి యువతరాన్ని నీల్ లాల్ రాజకీయాలకు ఆకర్షించడానికి ఇది ఒక బలమైన వ్యూహం కావొచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే అంబేద్కర్ –మార్క్స్ – గాంధీ ఆలోచన విధానం అనే అవగాహన. ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించవచ్చా పరిశీలించాలి.

13. అదే వరసలో ఆంథోనీ గ్రాంసి (Anthonio Gramsci) ఇటలీ కి చెందిన మరో యువ కమ్యూనిస్ట్ నాయకుడు 1925 ప్రాంతంలో 16 సంవత్సరాలు జైలు జీవితం గడిపి తన

జైలు డైరీ (prisondairy) ద్వారా అప్పటికి చెలామణి అవుతున్న మార్క్సిజానికి లెనినిజానికి భిన్నంగా కొత్త సిద్ధాంతం ప్రతిపాదించాడు. పాలకులు తమ అధికారాన్ని బలప్రయోగంతో కాకుండా ప్రజల సమ్మతితో ప్రజల విశ్వాసంతో ప్రజల కోసమే ఈ పాలకులు ఉన్నారని ప్రజలకు భ్రమ కలిపించి ప్రజలపై పెత్తనం చెలాయిస్తారని పేర్కొంటాడు. ఈ విధానన్నే ఆధిపత్య భావ జాలం (Hegemony)గా అభివర్ణిస్తాడు. ఆధిపత్య భావజాలం వ్యాప్తికి తమ ఆధీనంలో ఉన్న మీడియా, పత్రికలు సంఘాలు రాజకీయ పార్టీల ద్వారా ప్రజలలో ఈ భావన కలిగిస్తారు. అనగా అధికారం చాలా వికేంద్రీకరణ రూపంలో ఉంటుంది. శ్రామికుల రాజ్యాధికారం సంపాదించుకోవడానికి ఈ ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా పౌర సమాజం ద్వారా శ్రామిక భావ జాలాన్ని పెంపొందించాలని పేర్కొంటాడు. శ్రామికులు విముక్తి చెంది రాజ్యాధికారం పొందాలంటే నీల్ లాల్ లాంటి పౌర సమాజం ప్రజలతో మమేకమై ఆధిపత్య భావజాలానికి వ్యతిరేక భావజాలాన్ని పెంపొందించి ప్రజలను చైతన్యం చేసి రాజ్యాధికారం సాధించాలని అర్థం. దీని పై భారత కమ్యూనిస్టులు చర్చించినట్లు ఎక్కడ కనపడదు. బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నట్లు భారత కమ్యూనిస్టులు వినూత్న ప్రయోగాలకు స్థానిక పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించాలి అనే బలమైన వాదనకు gramsci పై చర్చ చేయకపోవడం ఇది ఒక రుజువు గా కనిపిస్తుంది.

14. చివరగా మూసలో పోసిన నినాదాలు లేదా ఎప్పుడు విన్న వాదనలు కాకుండా పీడిత కులాలకు, శ్రామిక ప్రజలకు అంబేద్కర్ ఆశించిన విధంగా పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమును మరియు అంతస్తులోనూ అవకాశం లోనూ సమానత్వం కలిగించి కుల రహిత సమాజం కోసం మరియు అంబేద్కర్, మార్క్స్ ఆశించిన దోపిడి లేని సమాజ స్థాపనకు కృషి చేయాలి. అదే విధంగా నీల్ లాల్ రాజకీయ కూటమి సమాజంలో మారిన పరిస్థితులను అధ్యయనం చేసి ఒక నూతన సిద్ధాంతంతో నూతన వ్యూహాలతో, నూతన నినాదాలతో నూతన ఒరవడిని సృష్టించటానికి నీల్ లాల్ రాజకీయ నినాదం ఒక రాడికల్ ప్రజాస్వామ్య వేదికగా అవతరించాలని ఆశిద్దాం. ❑

## మహత్తర విప్లవానికి బాటలు

**(26వ పేజీ తరువాయి)**

స్వస్తి చెప్పి, విలీనాల పర్వానికి దారి చూడాలి. సమస్త ప్రజాశక్తుల క్రోడీకరణ చేస్తూనే వారికి సరైన నాయకత్వం అందించడం అవసరం. మనం వికేంద్రీకరణ గురించి వంద ఉపన్యాసాలు చెప్పవచ్చు కానీ కేంద్రీకృత నాయకత్వం లేకుంటే బలమైన ఉద్యమాన్ని నిర్మించలేం. జాతీయ స్థాయిలో బలమైన కేంద్రీకృత నాయకత్వాన్ని, క్షేత్రస్థాయిలో వికేంద్రీకృత ఉద్యమాన్ని, విభిన్న పార్శ్వాలను సంవిలీనం చేసుకోగల కార్యాచరణను రూపొందిస్తే సంపూర్ణ విప్లవం సాధ్యమే అని నా భావన. గత వైఫల్యాలను బేరీజు వేసుకోవాలి.

గుజరాత్ నుండి జిగ్నేష్ మేవాని గెలుపులో లాల్–నీల్ ఐక్యత ధ్వనించింది. 'కాలా' సినిమాలో లాల్–నీల్ ఐక్యతపై సింబాలిక్ ఎక్స్‌ప్రెషన్ ఉంది. వీరన్న బాట, "మహాజన ఫ్రంట్" ఇవి ఇప్పటికే లాల్–నీల్ బాటలో సైద్ధాంతికంగానే కాక, ఆచరణలో కూడా రాష్ట్రవ్యాప్తంగా చేసిన ప్రయత్నాలు, వాటిని దూరం నుంచి చూసినప్పుడు వైఫల్యాలుగా కనిపించవచ్చు కాని అప్పుడు ఆ బీజాలు పడకపోతే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇలాంటి ఆలోచనలు వచ్చేవి కావేమో, నాకైతే అవి విజయాలుగానే తోచాయి (పరిమితంగానైనా), ఏ వైఫల్యం 100% వైఫల్యం కాదు. అందులో ఎంతో కొంత విజయం దాగి ఉంటుంది. ఒకప్పుడు కులపోరాటం అన్నది అన్యవర్గభావజాలం అని, అంబేద్కర్‌ను లిబరల్ బూర్జువా అన్న విప్లవ గ్రూపులన్నీ నేడు వైఖరిని మార్చుకుని పూలే, అంబేద్కర్‌ను కలుపుకుంటున్నాయి. కమ్యూనిస్టు సంస్థల నుండి బయటకు వచ్చినవారే నేడు అంబేద్కరిజం, బుద్ధిజం అంటూ కొనసాగుతున్నారు. దాంతో ఇరుపక్షాలకు అవతలివారిపై అవగాహన ఉంది.

భీమా కోరేగావ్ సమావేశాలకు భయపడి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్బంధాలకు పూనుకోవడం చూస్తే మనకన్నా అధికారంలో ఉన్న శక్తులకు ఈ లాల్–నీల్ ఐక్యతపై ఎంతటి ఆందోళన ఉందో అర్థమవు తుంది. అలానే సమస్యలు ప్రజాపరం అయినప్పుడు వచ్చే చైతన్యం నిజంగానే కదలిక తెస్తుంది. "సేవ్ నల్లమల' కాంపైన్ ప్రజాపరం అవడం వలనే విజయవంతం అయింది. ఎప్పుడైనా శత్రువు బలమైనవాడైతేనే మనలో ఐక్యత వస్తుంది. ప్రస్తుతం విశ్వ విద్యాలయాల్లో బహుజన విద్యార్థి సంఘాలు, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య సానుకూల స్నేహం ఏర్పడింది. ఆ దృష్ట్యా చూసినప్పుడు ఇది సరైన సమయం. ఏది ఏమైనా ఓ మహత్తర విప్లవానికి బాటలు వేస్తున్న మీకు అభినందనలు. ❑

# మార్క్సిజం సృజనాత్మకమైనది



రేకా చంద్ర శేఖర రావు

మార్క్సిజం అనేది సైన్స్. అంతేకాదు, అది Social Science – (సామాజిక శాస్త్రం) కూడా.

సైన్స్ – Physics, chemistry, maths సూత్రాలు అన్ని చోట్లా ఒకే రకంగా వర్తించబడతాయి.

కానీ సామాజిక శాస్త్రం అయిన మార్క్సిజం నిర్దిష్టమైన కాలము, నిర్దిష్ట స్థలాన్ని బట్టి అన్వయింపబడుతుంది. అన్వయింపు కలిగిన సృజనాత్మక సిద్ధాంతం మార్క్సిజం.

అభివృద్ధి చెందిన యూరపు, అమెరికాలలో ఒకరకంగా, వెనకబడిన రష్యాలో ఒకరకంగా, ఇంకా వెనకబడిన అర్ధవలస – అర్ధ ఫ్యూడల్ చైనా, వియత్నాం, కొరియా వంటి చోట్ల వేరొక విధంగా, ఆ మూడిటిలో కూడా విభిన్నంగాను, క్యూబాలో ప్రత్యేక పరిస్థితులలో వేరేగాను వర్తింప చేయబడ్డాయి.

అలాగే మనువాద మతవాదంతో గాఢంగా పెనవేసుకున్న నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కలిగిన మన దోపిడీ వ్యవస్థలో – మన దేశంలో మార్క్సిజం అన్వయింపు ప్రత్యేకంగా వుంటుంది.

**లాల్, నీల్ మైత్రి**
**నేటి చారిత్రక అవసరం**
**పుస్తకంపై**
**అభిప్రాయ వేదిక**

లెనిన్ రష్యా చరిత్రను, మావో చైనా చరిత్రను ఔపోసన పట్టారు, అక్కడి ప్రగతిశీల వారసత్వ సంపదను స్వీకరించారు. మావో అయితే కన్ఫ్యూషియస్ వంటి అభివృద్ధి నిరోధకుల సాహిత్యం–భావజాలంపై నిరంతర పోరాటం చేశారు. బౌద్ధంలోని ప్రజా ఉద్యమ దృక్పథాన్ని మావో బాగా ఆకళింపు చేసుకున్నాడు, మావో చెప్పిన ప్రజా సైన్యానికి పదిసూత్రాలు బౌద్ధంలోని వినయపిటకంలోని సూత్రాలే, వాటిని అభివృద్ధి చేసిన సూత్రాలే!

మన దేశంలో కూడా బౌద్ధం, జైనం, లోకాయతులు, చార్వాకులు, బసవేశ్వరుడు, సంత్ రవిదాస్, కబీరు, పల్నాటి బ్రహ్మన్న, వేమన తదితరుల అమోఘమైన ప్రగతిశీల వారసత్వ సంపద మనకు వుంది.

బుద్ధుడు చెప్పిన చలనం, అనిత్యం, కార్యకారణ సంబంధం తదితరం అన్నీ ప్రగతి శీలకమైనవే. బుద్ధుడు చెప్పిన చలనం, నిరంతర మార్పు (అనిత్యం) ల సిద్ధాంతం యొక్క కొనసాగింపే, వాటి సృజనాత్మక అభివృద్ధే మార్క్సిజం. అంటే మార్క్సిజం రూపకల్పనలో ఇవే ప్రధాన కారణం అని అర్ధం కాదు . ఇలాటి అనేక ప్రగతి శీల భావజాలాల సమ్మేళనమే మార్క్సిజం.

అసలు కారల్ మార్క్స్ మహనీయుడే "మేము చెప్పిన సిద్ధాంతం అంతా మా స్వంతం కాదు, మానవ విజ్ఞాన చరిత్రను క్రోడీకరించి ఒకచోట చేర్చడమే మేమిద్దరము చేశాము" అని వినయంగా చెప్పారు.

బుద్ధుడు చెప్పిన కొన్ని విషయాలు మార్క్సిజంలో ఇమిడిపోయాయి. బుద్ధుడు చెప్పినవి అన్నీ దాదాపుగా నేడు మనం స్వీకరించాల్సినవే. కుల వివక్షతను వ్యతిరేకించడంలోను, స్త్రీలకు బౌద్ధ మహిళా సంఘాలు ఏర్పాటు చేయడంలోను, బౌద్ధ భిక్షువులు ప్రజల మీద ఆధారపడి, ప్రజలలో, ప్రజలతో ప్రజా ఉద్యమ దృక్పథంతో జీవించిన విధానం ఇవన్నీ కూడా మనకు ఆదర్శనీయాలే.

ఇటీవల కాలంలో కొందరు మన దేశ ప్రగతిశీల వారసత్వ సంపద మీద విశ్వాసం లేనివారు, అలా విశ్వాసం లేదని కూడా బహిరంగంగా ధైర్యంగా ప్రకటించలేని వారు కొందరు ప్రాచీన మన ప్రగతిశీల వారసత్వ సంపద తప్పనిసరి అవసరం అని, ఆ సంపద కావాలని బలంగా కోరుతున్న మార్క్స్ వాదుల మీద చీటికి మాటికి సిద్ధాంతం పేరు చెబుతూ దాడి చేస్తున్నారు. అలా దాడి చేయడమే మార్క్సిజం అని చెప్పి చలాయించాలని చూస్తున్నారు.

మన దేశ కుల వ్యవస్థను సాంస్కృతిక అంశంగా మాత్రమే, ఉపరితల అంశంగా మాత్రమే వారు భావిస్తున్నారు. మన దేశంలో కులం అనేది ప్రజల వృత్తి , ఉపాధిలతో ముడిపడి వుంది. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలతో , ఉత్పత్తితో ఇంకా చెప్పాలంటే ప్రజల జీవన విధానంతో ముడిపడి వుంది. కులము ఉపరితల అంశం మాత్రమే కాదు, అది పునాది అంశం కూడా.

మన దేశంలో వర్గము– కులము జమిలిగా కలిసి వున్నాయి. అందుకే మన దేశంలో అత్యంత పేద శ్రామికుడు కూడా "నేను కూటికి పేదనే కాని కులానికి కాదు" అని గర్వంగా చెప్పుకునే సంస్కృతి వుంది. మన దేశంలో వర్గపోరాటాలు, కుల నిర్మూలనా పోరాటాలు విడి విడిగా లేవు, అవి పరస్పర ఆధారభూతాలే!

అందుకే అంబేద్కర్ కులం గురించి చెబుతూ, "అది శ్రమ విభజనే కాదు, శ్రామికుల విభజన కూడా" అని చెప్పారు.

ఆఫ్రికా ఖండంలో కమ్యూనిష్టులు వారి ప్రత్యేక సమస్య అయిన శ్వేత జాతి దురహంకార వ్యతిరేక పోరాటాన్ని వర్గ పోరాటంలో మిళితం చేసి పోరాడుతున్నారు. దానిని ఇక్కడ అందరూ బలపరుస్తున్నారు.

అదే రకంగా మన దేశ ప్రత్యేక సమస్య అయిన అమానవీయ కుల వ్యవస్థకు వ్యతిరేక పోరాటాన్ని చేపట్టడానికి, దానిని వర్గ పోరాటంతో ముడివేసి కొనసాగించడానికి ఎందుకు వెనుకంజ వేయాలి.

నేటి మన దేశ దోపిడీ వ్యవస్థను మనువాద భావజాలం కాపాడే ఉక్కు కోటగా వుంది. ఆ మనువాద భావజాలాన్ని బలపరచుకోడానికి రామాలయం పేరుతోను, గోవధ పేరుతోను, దేశభక్తి పేరుతో ముడిపెట్టి బలపరచుకుంటున్నారు. అంతేకాదు పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తున్నారు ఈ మనువాద ఫాసిస్ట్ పాలకులు. అంతే కాదు ఆ రెండు శక్తులూ విడివిడిగా నేడు లేవు. వారు భావజాల రంగాన్ని చాలా బలంగా ఎంచుకున్నారు, దానిని బలంగా ఆక్రమించారు. అందుకే లెనిన్, స్టాలిన్, మావోలు భావజాల రంగ పోరాటంలో అప్రమత్తులై వుండాలని చెప్పారు.

భావజాల చైతన్యం అనేది కొన్ని సందర్భాలలో చాలా కీలక మవుతుందని, భావజాలం భౌతిక రూపం తీసుకుని విస్ఫోటనాలను సృష్టిస్తుందని మహనీయులు మార్క్స్- ఎంగెల్స్‌లు ఎప్పుడో చెప్పి వున్నారు.

మనువాదులు వారి భావజాలాన్ని బలమైన ఆయుధంగా చేసుకోవడం ద్వారానే రెండో సారి కూడా అధికారంలోకి రాగలిగారు.

కానీ కొంతమంది మార్క్సువాదం పేరు చెప్పి భావజాల వ్యతిరేక పోరాటానికి, ప్రత్యేకించి మన దేశంలో జరగవలసిన మనువాద భావజాల వ్యతిరేక పోరాటానికి ఆవల దూరంలో వుంటున్నారు. పైగా మన దేశ ప్రాచీన ప్రగతిశీల చరిత్ర మనకు కావాలని, అది ప్రస్తుత మన పురోగమనానికి ప్రేరణగా వుంటుందని కోరుకునే మార్క్సు వాదుల మీద విపరీత దాడి చేయడమే పనిగా పెట్టుకున్నారు. మనువాద భావజాల వ్యతిరేక పోరాటంలో చాలా సౌకర్యంగా ఒక ఒడ్డున కూర్చుని చూస్తున్నారు,

ఆ రకంగా మనువాద భావజాల శక్తులకు కావలసినంత సాయం చేస్తున్నారు. వారు మనువాదంపై పోరాడారు పైగా పోరాడే వారికి వ్యతిరేకంగా రాళ్ళు వేస్తూ మనువాదులకు ఉచిత సేవ చేస్తున్నారు.

ఈ రచయితలు మనువాదానికి వ్యతిరేకంగా పోరాడే మార్క్సు వాదులను కమ్యూనిష్టు పార్టీలను విచ్ఛిన్నం చేసి అంబేద్కర్ వాదంలోకి ఆ పార్టీలను తీసుకుపోతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు, వాస్తవానికి వారు ఏ మనువాదానికి ఉచిత సేవ చేస్తున్నారో ఆ విషయాన్ని కప్పి పెట్టుకోడానికి మాత్రమే ఈ ప్రచారం చేస్తున్నారు.

## వీరి గురించి

వీరికి వర్తమాన దేశ సమస్యలు పట్టవు. వీరు కులాంతర వివాహాల పట్ల నిర్లక్ష్య పూరితంగా వుంటారు,

SC, ST, BCల రిజర్వేషన్లను గురించి తెలియనట్లు వుంటారు లేకపోతే సోషలిజం వస్తే రిజర్వేషన్ల సమస్య, కుల సమస్య పరిష్కారం అవుతుందని చెబుతూ, అప్పటి వరకు ఏమి చేయాలో మాత్రం చెప్పరు. సోషలిజం వచ్చినప్పుడు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయనే దానిలో ఎవరికీ విభేదం లేదు, కానీ ఈ లోపు ఎలా వుండాలి అనే దాని మీదనే విభేదం.

వీరి రచనలలో అత్యంత బలహీన అంశం వర్తమానం గురించి, వర్తమాన ప్రాసంగికత గురించి పట్టించుకోక పోవడం. వర్తమానం గురించి, ప్రాసంగికత గురించి చెప్పే మార్క్సు వాదుల తప్పులను రంధ్రాన్వేషణ చేసి కనుగొనడం, అదే మార్క్సిస్టు సాహిత్య సృజనగా భావించుకుని ప్రచారం చేయడం వీరు చేస్తుంటారు.

వారి రచనా నైపుణ్యాలను ఇలా వృధా పరచకుండా వర్తమాన ప్రజా సమస్యలకు, ప్రజా వుద్యమాలకు అనుసంధానం చేసి కనుక రాస్తే ప్రజాస్వామిక, వామపక్ష వుద్యమాలకు వీరు ఎంతో బలాన్ని ఇవ్వగలుగుతారు, ఆ పని చేయాలని వారి శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు.

మన దేశంలో మనువాదానికి ప్రత్యామ్నాయ స్థిరమైన భావజాలం కలిగిన వారు మార్క్సు వాదులు- అంబేద్కర్ వాదులు మాత్రమే. వారిద్దరూ కలిసి పని చేయాలని ప్రగతిశీల శక్తులు కోరుకుంటున్నాయి.

ఆ రెండు సిద్ధాంతాల మధ్య విభేదాలు వున్నప్పటికీ ఈ ప్రధాన విషయంలో అంగీకారం అంటే మనువాద భావజాల వ్యతిరేకత అనేది బలంగా వుంది.

ఈ రెండు శక్తులు కలిసి పనిచేయడం నేడు తక్షణ అవసరం కూడా!

వర్ధిల్లాలి! లాల్- నీల్ ఐక్యత వర్ధిల్లాలి! వర్ధిల్లాలి! ❑